నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

1

నిజామాబాద్-కామారెడ్డి

బుధవారం | అక్టోబర్ 02 2024 | www.navatelangana.com

మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం ఎన్నడో..?



నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో మహిళా శక్తి క్యాంటీన్‌ను ఎప్పుడు ప్రారంభిస్తారో అని మండల వాసులు ఎదురుచూస్తున్నారు. క్యాంటీన్ మంజూరు కాగా.. ఎస్సీ కార్పొరేషన్‌కు చెందిన భవన సముదాయాన్ని కేటాయించారు. గదులు శిథిలావస్థకు చేరడంతో వాటిని మరమ్మతులు చేయించారు. అంతా సిద్ధం చేసినా ఇంకా ప్రారంభించకపోవడంతో ఎప్పుడు ప్రారంభిస్తారో అని ప్రశ్నలు ఉత్పన్నం అవుతున్నాయి. టిఫిన్ ధరలు సైతం ప్లేట్ 20 ఉంటుందని తెలపడంతో వాటికోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు. ఈ విషయమై ఆరా తీయగా.. సంబంధిత శాఖ మంత్రి అందుబాటులో లేకపోవడంతో ప్రారంభోత్సవం ఆలస్యమవుతున్నట్టు సమాచారం. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి సకాలంలో ప్రారంభించేలా చూడాలని మండల వాసులు కోరుతున్నారు.

పట్టపగలు చైన్‌స్నాచింగ్



నవతెలంగాణ-మెండోరా

మండలంలోని దూదిగం గ్రామంలో పట్టపగలు బంగారు పుస్తెల తాడు చైన్ స్నాచింగ్ ఘటన చోటుచేసుకున్నట్టు ఎస్ఐ నారాయణ తెలిపారు. వివరాలలోకి వెళ్తే నిర్మల్ జిల్లా కేంద్రం గొల్లపేట్‌కు చెందిన సంద స్వప్న కుమారుడు మెండోర మండలం దూదిగం గ్రామంలోని సీఎస్ఐ పాఠశాలలో హాస్టల్‌లో ఉంటూ చదువుతున్నాడు. వారి కుమారుడిని దసరా సెలవులకు తీసుకువెళ్తుండగా నిర్మల్ వెళ్ళడానికి దూదిగం గ్రామంలోని ఎన్‌హెచ్ 44 జాతీయ రహదారి వైపు వెళుతుండగా జాతీయ రహదారి బ్రిడ్జి కింద గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు బైక్ పై వచ్చి స్వప్న మెడలోని బంగారు పుస్తెల తాడు తెంచుకొని ఆర్మూర్ వైపు వెళ్లారని బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



ఓ షాప్‌లో 850 రూపాయలకు కిలో మటన్ తూకం

మటన్ ముద్ద దిగట్లే

- **కిలో మటన్ రూ.850**
- **మధ్యతరగతికి మరింత దూరమవుతున్న మటన్**

నవతెలంగాణ-నిజామాబాద్‌డెస్క్

పెత్తరామాస వేళ.. పెద్దలకు నైవేద్యం పెట్టుకునేందుకు మటన్ కోసం షాప్‌కు వెళ్లిన మధ్యతరగతి జీవి ఒక్కసారిగా అవాక్కయ్యాడు.. కిలో మటన్ ధర రూ.850కు చేరడంతో కొనలేక, ఒట్టిచేతులతో ఇంటికి వెళ్లలేక సతమతమయ్యాడు. ఇటీవల వరకు కిలో 750-800 ధర పలికిన మటన్ ధర.. ఒక్కసారిగా కిలోకు రూ.50 పెరగడం గమనార్హం.

ప్రతేడాది దసరా ముందు మటన్ మాంసం ధరలు పెరుగుతూ ఉంటాయి. ఈసారి సైతం ఒక్కసారిగా రూ.50 పెరగడం గమనార్హం. అసలే మటన్ ధర అధికంగా ఉండటంతో మధ్యతరగతి ప్రజలు ఆచితూచీ కొనుగోలు చేస్తుంటారు. మరోసారి అమాంతంగా పెరగడంతో వారికి మటన్ ముక్క మరింత దూరం అవుతుంది. ఈ నేపథ్యంలో మధ్యతరగతి ప్రజలు మటన్‌షాప్‌వైపు కన్నెత్తి చూసే సాహసం కూడా చేయలేని పరిస్థితి నెలకొంది. అయితే మార్కెట్‌లో మేక, గొర్రె పొట్టేలు ధరలు పెరగడంతో తాము ధర పెంచాల్సి వస్తుందని షాప్ నిర్వాహకులు పేర్కొంటున్నారు. మార్కెట్‌లో అన్ని వస్తువుల ధరలు పెరుగుతున్నా.. వేతనాల పెరుగుదల లేదని మధ్యతరగతి ప్రజలు వాపోతున్నారు. పండుగ వేళ మటన్ ముద్ద కరువవుతున్నట్టు వాపోతున్నారు.

పూలసంబురం షురూ

- **నేటి నుంచి బతుకమ్మ వేడుకలు**
- **తీరొక్కపూలతో 9 రోజుల పాటు సంబరాలు**

నవతెలంగాణ-బోధన్

పూలనే దైవంగా పూజించే ప్రత్యేక పండుగ బతుకమ్మ. మన సంస్కృతి, సంప్రదాయాలను ప్రతీకగా నిలిచిన ప్రకృతిలోని అనుబంధాన్ని తెలియజేస్తుంది ఈ పండుగ. మహిళల ఆస్తిత్వానికి అద్దంపడుతూ వారి సృజనాత్మక శక్తిని తెలుపుతుంది. పూలు పేర్చడం నుంచి పాటలు పాడడం వరకు ప్రతిదీ మనోహరంగా కొనసాగుతుంది. బతుకమ్మ పండుగ సంబరాలు బుధవారం నుంచి నవరాత్రులు అనగా 9 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. మహిళలకు ఇష్టమైన పండుగ బతుకమ్మ వేడుకలు. తొమ్మిది రోజులు వేడుకల్లో తంగేడు, జిల్లేడు, గునుగు, బంతి, చేమంతి పువ్వులు ఎన్నెన్నో పువ్వులు ఈ పండుగ కోసమే అన్నట్లు కనిపిస్తుంది. బతుకమ్మ పండుగను ఆధ్యాత్మిక సాధకులు సామూహిక శక్తి ఉపాసనగా ఆత్మచైతన్యానికి మేలుకొలుపుగా భావిస్తారు. నవరాత్రుల్లో సకల జనావళి దుర్గాదేవిని పూజించి తరించాలని దేవిపురాణం తెలుపుతుంది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రాంతంలో శరన్నవరాత్రులకు ఒకరోజు ముందే భాద్రపద బహుళ అమావాస్య నుంచి ఆశ్వయుజ శుక్ల అష్టమి వరకు బతుకమ్మ పండుగను నిర్వహిస్తారు. బతుకమ్మను లక్ష్మీదేవి, పార్వతి దేవిలా అంశగానే కాదు శ్రీ చక్రశోభితగా, ప్రకృతికి ప్రతిరూపంగా, తమ ఇంటి ముత్తైదువగా మహిళలు భావిస్తారు. వాటిని పాటలుగా ఆలపిస్తారు. ఇలా గీతాలతో దేవిని ఆరాధించడమే కాదు మనసులోని కష్టసుఖాలను పురాణ కథలు చారిత్రక ఘట్టాలను పేర్కొంటారు. తొమ్మిది



కామారెడ్డిలోని అక్షరలో

రోజులు బతుకమ్మ పండుగ నవ మాసాలకు ప్రతీక. ఈ కారణంగా ఈ పండగను సంతాన సాఫల్యతకు సంబంధించిన వేడుక అని పేర్కొంటారు. ఈ తొమ్మిది రోజులు బతుకమ్మను పూజిస్తూ దానధర్మాలు చేస్తే అమ్మవారి అనుగ్రహంతో మంచి సంతానం కలుగుతుందని భక్తులు విశ్వసిస్తారు. భక్తికి బతుకమ్మ పండుగ ఎంతో ప్రాచస్తమైందని భావిస్తారు.

రంగురంగుల పూలు రకరకాల నైవేద్యాలు

బతుకమ్మను రకరకాల రంగుల పూలతో అలంకరిస్తారు. ఎన్నో రకాల నైవేద్యాలను సమర్పిస్తారు. పూలను పేర్చటం సృజనాత్మకమైన కళ. తంగేడు, బంతి, గునుగు, గుమ్మడి ,తీగమల్లే, మంకెన, వక్క, బంతి ,కనకాంబరం, గన్నేరు తదితర పూలతో బతుకమ్మలను తయారు చేస్తారు. పైన పసుపుతో చేసిన గౌరమ్మను పెట్టి చుట్టూ దీపాలతో తీర్చి దిద్దుతారు. ఈ గౌరవమ్మను బొడ్డెమ్మ అని పిలుస్తారు. మరికొందరు బతుకమ్మని బొడ్డెమ్మగా చెప్తారు. తల్లి గర్భంలో పెరుగుతున్న శిశువుకు ఆహారం బొడ్డుతాడు ద్వారా అందుతుంది .ఆ బొడ్డుతాడుకు దివ్యత్వాన్ని జోడించిన స్వరూపమే బొడ్డెమ్మగా అవతరించిందని భక్తుల విశ్వాసం. ఎవరికి వారు మొదట బతుకమ్మను పూజించి తర్వాత తమ వీధిలో విశాల ప్రాంగణంలో తీసుకెళ్లి ఆడుతారు. ఆ ప్రాంత మహిళలు బతుకమ్మల చుట్టూ వలయాకారంలో తిరుగుతూ పాటలు పాడుతారు. చివరికి చెరువు సమీపంలో పూజలు చేసి నిమజ్జనం చేస్తారు.

రోజుకొక్క పేరుతో..

బతుకమ్మలను తొమ్మిది రోజులపాటు రోజుకు ఒక్క పేరుతో పిలుస్తూ మహిళలు పూజిస్తారు. తొలిరోజు బతుకమ్మను ఎంగిలిపూల బతుకమ్మ అని ముందు రోజు కోసిన పూలను నీళ్లలో వేసి మరునాడు అలంకరణకు వాడడం వల్ల అలా పిలుస్తారు. రెండవ రోజు అటుకుల బతుకమ్మ ,మూడవరోజు ముద్దపప్పు బతుకమ్మ, నాలుగవ రోజు నానబియ్యం బతుకమ్మ 5వ రోజు అట్ల బతుకమ్మ అని పిలుస్తారు. ఆరో రోజు అలిగిన బతుకమ్మ అంటారు .ఆ రోజు అమ్మవారు అలకలో ఉంటుందని భక్తులు నామకరణ చేశారు. ఏడో రోజు వేపకాయల బతుకమ్మ. సకినాల పిండిని వేపకాయలుగా చేసి నైవేద్యంగా పెట్టడం వలన ఆ పేరు వచ్చింది అంటారు. ఎనిమిదవ రోజు వెన్నెముద్దుల బతుకమ్మ. దేవికి వెన్నతో తయారుచేసిన నువ్వుండలను నైవేద్యంగా పెట్టడం వలన అలా పిలుస్తారని చెబుతారు. ఇలా తొమ్మిది రోజులు అమ్మవారికి సమర్పించే నైవేద్యాన్ని బట్టి ఆరోజు బతుకమ్మను పిలవటం చేస్తారు. తొమ్మిదో రోజు సజ్జల బతుకమ్మ అంటారు. ఈ తొమ్మిది రోజులు ముగిశాక పోయిరా బతుకమ్మ పోయి రావమ్మ మల్లొచ్చే యేడాది తిరిగి రావమ్మ అంటూ ఘనంగా వీడ్కోలు పలుకుతారు.



వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్

వృద్ధులు సామాజిక సేవలో పాల్గొనాలి

- **జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్**

నవతెలంగాణ-కామారెడ్డి

వృద్ధులు ఆరోగ్యవంతంగా ఉంటూ, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. మంగళవారం అంతర్జాతీయ వయో వృద్ధుల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి పట్టణంలోని వయో వృద్ధుల ఫోరం భవనంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. తల్లిదండ్రులను పోషించనీ వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవచ్చని సూచించారు. యోగ కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందనీయ మన్నారు. ప్రతీ రోజూ నడక, వ్యాయామం చేయాలని తద్వారా ఆరోగ్యవం తంగా ఉంటారని తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందు ప్రియ మాట్లాడుతూ.. వృద్ధులు తమ మనుమలు, మనుమరాళ్ళతో కాలక్షేపం చేయాలని సూచించారు. ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి బాబయ్య మాట్లాడుతూ.. వయోవృద్ధులను చిన్న పిల్లల్లా చూసుకోవాలని, ఆప్యాయంగా పలకరించాలని అన్నారు. వివిధ పోటీల్లో గెలుపొందిన వారికి కలెక్టర్ మెమొంటోలు అందజేశారు. వృద్ధుల సంక్షేమ ఫోరం ఆవరణలో కలెక్టర్ మొక్కను నాటారు. కార్యక్రమంలో వృద్ధుల ప్రతినిధులు, పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారాలతో

ప్రజలను తప్పుదోవ పట్టించొద్దు

- **ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి**

నవతెలంగాణ-కంఠేశ్వర్

ప్రజలను తప్పుడు ప్రచారాలతో బిఆర్ఎస్ పార్టీ నాయకులు తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం నిజామాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం లో మాజీ మంత్రివర్యులు బోధన్ నియోజకవర్గ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి ప్రజలకు ఉపయోగపడే ఒక్క పని కూడా చేయని బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఇప్పుడు ప్రజల కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని విమర్శించడం విడ్డూరంగా ఉందని అన్నారు. బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, రుణమాఫీ విషయంలో గానీ హైడ్రా విషయంలో గానీ ప్రజలను తక్కువదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. 10 సంవత్సరాలు అధికారంలో ఉండి రైతులకు ఒక లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేయలేని బిఆర్ఎస్ పార్టీ ఈరోజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

ప్రజలకు రెండు లక్షల వరకు రుణమాఫీ చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం పై మాట్లాడుతున్నారని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని కేవలం బ్యాంకుల్లో వివరాలు తప్పుగా ఉన్న వారికి మాత్రమే కాలేదని బిఆర్ఎస్ తీసుకు వచ్చిన ధరణిలో లోపాల వల్ల కొందరికి రుణమాఫీ కాలేదని వాటన్నింటినీ కూడా కాంగ్రెస్ పార్టీ పరిష్కరించే విధంగా అన్ని బ్యాంకులకు ఆదేశాలు ఇచ్చిందని ఆయన అన్నారు.

రేపు పీసీసీ చీఫ్ రాక

తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా నిజామాబాద్‌కు చెందిన మహేష్ కుమార్ గౌడ్ నియమితులై తొలిసారి ఈ నెల 4వ తేదీన నిజామాబాద్‌కు వస్తున్న సందర్భంగా పాత కలెక్టర్ గ్రౌండ్ లో నిర్వహించే బారి బహిరంగ సభలో అధిక సంఖ్యలో కార్యకర్తలు ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహిర్ బీన్ హంధాన్, పీసీసీ ప్రధాన కార్యదర్శి గడుగు గంగాధర్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షులు కేశవేణు, బాల్కొండ నియోజకవర్గ ఇన్చార్జ్ సునీల్‌రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకులు రత్నాకర్, జిల్లా కిసాన్ కాంగ్రెస్ అధ్యక్షులు ముప్పగంగారెడ్డి, జిల్లా ఎన్ఎస్యుఐ అధ్యక్షులు వేణు రాజ్, జిల్లా సేవదళ్ అధ్యక్షులు సంతోష్ ,జిల్లా ఓబీసీ అధ్యక్షులు నరేందర్ గౌడ్, పీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్,వేణు గోపాల్ యాదవ్ పాల్గొన్నారు.

పండుగలకు ప్రత్యేక బస్సులు

- **బతుకమ్మ, దసరాకు 482 ప్రత్యేక బస్సులు : ఆర్టీసీ ఆర్ఎం**

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ



బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా ప్రయాణీకుల రద్దీ నేపథ్యలో ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆర్.టి.సి. రీజినల్ మేనేజర్ కె. జాని రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు నిజామాబాదు నుండి జె.బి.యస్ వరకు, జె.బి.యస్ నుండి నిజామాబాదు వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక బస్సు కలదు అని, పండుగ రద్దీ కారణంగా ప్రయాణీకుల సౌకర్యార్ధం ఈనెల 01 నుంచి 15 వరకు అదనముగా మరో 482 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రీజియన్‌లోని నిజామాబాదు-1, నిజామాబాదు-2, బోధన్, ఆర్మూర్, బాన్సువాడ, కామారెడ్డి డిపోల నుండి జె.బి.యస్ వరకు బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. అలాగే ఇతర ప్రదాన రూట్లలో కూడా ప్రత్యేక బస్సులు నడుస్తాయిని తెలిపారు. దూర ప్రాంతాలకు వెళ్ళే ప్రయాణీకులు ముందస్తు రిజర్వేషన్ కొరకు వెబ్ సైట్ %ఃషుఃష్.ంతీఎశీశ్రీఱఅవ.ఱఅ% లో రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. బస్సుల మరింత సమాచారం కోరకు ఆర్మూర్ - 7382843133, బోధన్ - 9849500725, నిజామాబాదు 9959226022, బాన్సువాడ - 9491105706, కామారెడ్డి - 8468220281 నెంబర్లను సంప్రదించాలని సూచించారు. ప్రయాణీకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సురక్షితం, సుఖవంతమైన ప్రయాణంతో తమ కుటుంబ సమేతంగా ఈ పండుగలు జరుపుకోవాలని, అలాగే తిరుగు ప్రయాణంలోను అర్టీసీ ప్రత్యేక బస్సులు నడుపనున్నట్లు తెలిపారు.

పంట సర్వేకు మ్యాన్‌పవర్ కావాలి

- **ఇతరాత్ర అవకాశాలు పరిశీలించాలి**
- **పనిచేస్తున్నా ఆబ్సెంట్ వేయడం సరికాదు**
- **నల్లబ్యాడ్జీలతో వ్యవసాయ విస్తరణ అధికారుల నిరసన**

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి/మోపాల్/ లింగంపేట్/ నాగిరెడ్డిపేట్

'డిజిటల్ పంట సర్వేకు అదనంగా మ్యాన్ పవర్ కావాలి. గతంలో పైలట్ ప్రాజెక్టు చేపట్టిన అనుభవాలు గమనించాలి. వ్యవసాయ శాఖలో అన్ని పనులు చేస్తున్న తమను ఆబ్‌సెంట్‌గా పరిగణించడం సరికాదని' మండల వ్యవసాయ విస్తరణ అధికారులు వాపోయారు. యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లబ్యాడ్జీలు ధరించి జిల్లా వ్యాప్తంగా పలు మండలాల్లో నిరసన చేపట్టారు. జక్రాన్‌పల్లి, మోపాల్ మండల కేంద్రాల్లోని రైతు వేదికల ఎదుట నిరసన వ్యక్తం చేశారు. జక్రాన్‌పల్లిలో మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారుల జిల్లా యూనియన్ అధ్యక్షుడు భాస్కర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం డి సి ఎస్ డిజిటల్ క్రాఫ్ట్ సర్వే యాప్ ఇన్‌స్టాల్ చేసుకొని సర్వే చేయాల్సిందిగా ఒత్తిడి చేస్తున్న తరుణంలో, కేంద్ర ప్రభుత్వ ఆదేశాలు ప్రకారం ఈ డిజిటల్ క్రాప్ సర్వే నిర్వహించడానికి పెద్ద మొత్తంలో మ్యాన్ పవర్ అవసరం ఉన్నట్టు తెలిపారు. గత సంవత్సరం



జక్రాన్‌పల్లిలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన చేపట్టిన ఏఈవోలు

ఎడపల్లి మండలంలో పైలెట్ ప్రాజెక్టులో భాగంగా పని చేసినా అనుభవంతో ఖరీఫ్‌లో సర్వే చేయడానికి 20 మంది తో సర్వే మొదలు పెడితే 75 రోజుల వ్యవధి తీసుకుందని, యసంగిలో 10 మందితో 90 రోజులు పట్టిందని తెలిపారు. ఈ లెక్కన ఒక వ్యక్తి సర్వే చేయడానికి సుమారు 15 నెలలు (450 రోజులు) పడుతుందని తెలిపారు. కావున దేశంలో వివిధ రాష్ట్రాలు అనుసరిస్తున్న విధానాలను రాష్ట్రంలో కూడా అనుసరించాలని, మన పక్క రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ లో కూడా అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని కోరారు. గత 11 రోజుల నుంచి ఉన్నది అధికారుల కు వినతి పత్రాలు ఇస్తున్నప్పటికీ, మాపైన కనికరం లేకుండా రోజువారి కార్యక్రమాలు క్రాప్ లోన్ పంట రుణాలకు రానివారి కుటుంబ సభ్యుల నిర్ధారణ , క్షేత్రస్థాయిలో వరి పంటకు వివిధ తెగుళ్ల పురుగులు ఆశిస్తున్న క్షేత్రాలను పరిశీలిస్తూ రైతులకు సూచనలు ఇస్తున్నా ఇతరాత్ర రోజువారీ పనులు చేపడుతున్నా తమను ఆబ్సెంట్ కింద పరిగణించడం సరికాదని అన్నారు. కార్యక్రమంలో జక్రాన్‌పల్లి మండల వ్యవసాయ విస్తీర్ణ అధికారులు అరిగేల శ్రీకాంత్, బి. శివప్రసాద్, సుభాష్య తదితరులు పాల్గొన్నారు.

ఒక్కరితో వేల ఎకరాల సర్వే కష్టం

లింగంపేట్ మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖలో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. నాగిరెడ్డిపేట్‌లో నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం డిజిటల్ క్రాప్ సర్వేను క్లస్టర్‌లోని ఒక ఏఈఓలు 5-8 గ్రామాలు, 6 వేల నుంచి 10 వేల ఎకరాలు చేయటం కష్టతంమవుతుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇట్టి డీఎస్సీ సర్వే కొరకు గ్రామ స్థాయిలో సహాయకులు నియమించాలని రాష్ట్ర వ్యవసాయ సంచాలకులకు సమస్యలు విన్న వించారు లింగంపేట్‌లో రాకేష్, సంతోష్, మధు సూదన్, అమీర్, నవ్య నిరసన వ్యక్తం చేయగా.. నాగిరెడ్డిపేట్ మండలంలో నిరసనలో ప్రశాంత్ కుమార్, దివ్య , రవికుమార్, షఫీ పాల్గొన్నారు.



లింగంపేట్‌లో..



మోపాల్‌లో..



నాగిరెడ్డిపేట్ మండలంలో..

మున్సిపల్ కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

- **తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) గౌరవాధ్యక్షులు రమేష్ బాబు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా గౌరవ అధ్యక్షులు ఏ రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ యూనియన్ సమావేశం సిఐటియు కార్యాలయంలో నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వం కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికులందరినీ పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి మర్చిపోయిందని కాంగ్రెస్ ప్రభుత్వం కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలు అమలు జరుపుతామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చే పది నెలలు అవుతున్నప్పటికీ కార్మికుల సమస్యలను చర్చించకపోవడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలను పెంచాలని శానిటేషన్ కార్మికులకు కనీస వేతనం 26,000 ఇవ్వాలని డ్రైవర్లకు ఇంజనీరింగ్ సిబ్బందికి 29 వేల రూపాయలు ఇవ్వాలని సిబ్బందికి 31,000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ కార్మికుల కనీస వేతనాలు పెంచాలని ఇప్పటికే సిబిటియు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆందోళనలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేసినట్టు తెలిపారు. రాబోయే కాలంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహించాల్సి వస్తుందని ఆయన తెలిపారు. గతంలో ప్రభుత్వం పెంచిన వెయ్యి రూపాయల వేతనం నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని డ్రైవర్లకు మూడు నెలలు ఇచ్చి వెనక్కి తీసుకోవడం జరిగిందని అధికారులు వెంటనే మున్సిపల్ డ్రైవర్లకు పెంచిన వేతనం ఇవ్వాలని అనేకమార్లు మొరపెట్టుకున్నప్పటికీ దాన్ని అమలు జరపటం లో నిర్లక్ష్యం వహిస్తున్నారని ఇది సరైనది కాదని వెంటనే గత రెండు సంవత్సరాలుగా బకాయిలు ఉన్న డ్రైవర్ల వేతనాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన నిర్వహించాల్సి వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ యూనియన్ నాయకులు భూపతి, ఏక్ నాథ్, సంతోష్ సింగ్, సూర రవి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రమేశ్‌బాబు

సెలవులకు చలోచలో

- **విద్యార్థులతో కిక్కిరిసిన బస్టాండ్‌లు**

నవతెలంగాణ-ఆర్మూర్/నిజామాబాద్‌సిటీ

బతుకమ్మ, దసరా సెలవుల నేపథ్యంలో హాస్టళ్లల్లో, గురుకులాల్లో ఉంటూ చదువుకునే విద్యార్థులు ఇంటి బాట పట్టారు. వారి సరంజామా తీసుకొని ఇండ్లకు వెళ్లేందుకు బస్టాండ్‌లకు వెళ్లడంతో ప్రయాణ ప్రాంగణాలు కిక్కిరిశాయి. బస్టాండ్‌లలో మధ్యాహ్నం నుంచే నుంచి విద్యార్థుల తాకిడి నెలకొంది. కాగా సరిపడా బస్సులు లేక విద్యార్థులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.





బస్సు ఎక్కేందుకు గూమిగూడిన విద్యార్థులు.. బ్యాగులు సర్దుకొని బస్సుకోసం వెళ్తూ..







నిజామాబాద్‌లో బస్ ఎక్కేందుకు ఇక్కట్లు పడుతున్న ప్రయాణికులు.. బస్సుల కోసం పడిగాపులు.. ఆర్మూర్ బస్టాండ్‌లో...

నవతెలంగాణ
నిజామాబాద్ 2
బుధవారం | అక్టోబర్ 02, 2024 | www.navatelangana.com

ఉమ్మడి జిల్లాల హ్యాండ్ బాల్ ఎంపికలు

నవతెలంగాణ-ఆర్మూర్
ఉమ్మడి జిల్లాల సీనియర్ మెన్, ఉమెన్ హ్యాండ్ బాల్స్ సెలక్షన్స్ లు మంగళవారం పట్టణంలో నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియలో నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల నుండి మెన్ విభాగంలో 50 మంది క్రీడాకారులు, ఉమెన్ విభాగంలో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారని జిల్లా హ్యాండ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షులు గంగ మోహన్ చక్రు, ప్రధాన కార్యదర్శి పింజ సురేందర్ తెలిపారు. ఈ ఎంపిక ప్రక్రియలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఈ నెల 9, 10, 11 తేదీల్లో రంగారెడ్డి జిల్లాలో జరగబోయే 53వ తెలంగాణ రాష్ట్ర స్థాయి సీనియర్ మెన్ అండ్ ఉమెన్ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలను నిజామాబాద్ జిల్లా హ్యాండ్ బాల్ సంఘం కోశాధికారి గట్టడి రాజేష్ ఆధ్వర్యంలో పిఈటిలు సంజీవ్, రాజేందర్ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ పూర్ణచందర్ , పిడి, పిఈటిలు, సీనియర్ హ్యాండ్ బాల్ క్రీడాకారులు పాల్గొన్నారు.

చిట్టాపూర్‌లో ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-బాల్కొండ
మండల పరిధిలోని కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో చిట్టాపూర్ గ్రామంలో మంగళవారం ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్రవంతి 38 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు ముగ్గురికి రక్త పరీక్షలు చేశారు. ఈకార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ గిరిబాబు, సబ్ యూనిట్ అధికారి మురళి,పర్యవేక్షకురాలు మెరమ్మ, ఆరోగ్య కార్యకర్తలు లత, స్వరూప, ఆశ కార్య కర్తలు అనిత, సాహేరబాను పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

రైల్వే స్టేషన్లో వ్యక్తి అదృశ్యం

- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న రైల్వే పోలీసులు**

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రైల్వే పోలీస్ స్టేషన్లో ఓ వ్యక్తి అదృశ్యమైనట్లు రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి మంగళవారం తెలిపారు. రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సాయిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం పోతంగల్ గ్రామానికి చెందిన సయ్యద్ మౌలానా, ఆయన భార్య కలసి నెల్లూరు నుంచి నిజామాబాద్ కు కృష్ణ ఎక్స్ప్రెస్ లో రాత్రి 3 గంటలకు వచ్చారు. రాత్రి అయినందున రైల్వే స్టేషన్ ప్లాట్ఫామ్‌పై నిద్రపోయారు. సయ్యద్ మౌలానా కు మానసిక పరిస్థితి సరిగా లేక భార్య నిద్రిస్తుండగా చెప్పకుండా వెళ్లిపోయాడు. తరువాత చుట్టూ పక్కల వెతికినా కనిపించలేదు. ఈ విషయం వెంటనే తన కుమారుడికి తెలియజేయగా నిజామాబాద్ చేరుకొని రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు రైల్వే పోలీసులు అదృశ్యం కేసుగా నమోదు చేశారు. చేసి రెండు స్పెషల్ పార్టీలను ఏర్పాటు చేసి దర్యాప్తు చేపట్టారు. నిజామాబాద్ వాసులకు ఎక్కడైనా మిస్సింగ్ అయిన వ్యక్తి కనిపిస్తే వెంటనే సాయిరెడ్డి ఎస్ఐ రైల్వే నిజామాబాద్ కి 8712658591 కు ఫోన్ చేసి సమాచారం అందించాలన్నారు.

దళారులకు సోయా విక్రయించి నష్టపోకండి

నవతెలంగాణ-బోధన్
రైతులు పండించిన సోయా పంటలను దళారులకు విక్రయించి నష్టపోవద్దని బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన సాలూర, మంధర్న గ్రామాలలో పర్యటించి సోయా రైతులతో మాట్లాడారు. సోయా పంట వర్షాల వలన ఏదైన నష్టం జరిగింది, ఎంత దిగుబడి వచ్చింది, వైరస్ వలన ఏదైన కోల్పోయారు అంటూ ఆయన రైతులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఒక చోట సోయా పంట ఆరబెట్టిన రైతుల వద్దకు వెళ్లి వారితో మాట్లాడుతూ త్వరలో ప్రభుత్వం ద్వారా సోయాపంట కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, దయచేసి రైతులు తక్కువ ధరకు దళారులకు అమ్మకూడదని సూచించారు. ప్రభుత్వం సోయా పంటకు కనీస మద్దతు ధర రూ 4892 అందిస్తుందని, రైతులు మద్దతు ధరను పొంది లాభం పొందాలని అన్నారు. రెండు లక్షలు రుణమాఫీ కాని రైతులకు త్వరలో రుణమాఫీ చేయడం జరుగు తుందని తెలిపారు. చెరుకు పంట వేసేందుకు రైతులు ముందుకు వస్తే షుగర్ ఫ్యాక్టరి ప్రారం భిస్తామని చెప్పగా అందుకు రైతులు తప్పకుండా చెరుకు పంటను సాగు చేస్తామని తెలిపారు. మంధర్నా గ్రామంలోని ప్రభుత్వభూమిలోని పేదలకు త్వరలో సర్వే చేసి పట్టాదార్ పాస్ పుస్తకాలు ఇస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు.


రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

టీచర్ ఉద్యోగం సాధించిన యువకుడికి అభినందన...
సాలూర మండల కేంద్రానికి చెందిన గగన్ అనే యువకుడు డీఎస్సీ పరీక్ష ఫలితాల్లో జిల్లా 3 వ ర్యాంకు సాధించడంతో ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి గగన్‌ను ప్రత్యేకంగా అభినందించి శాలువతో సన్మానించారు. టీచర్ ఉద్యోగంలో చేరి విద్యార్థులకు ఉన్నతులుగా తీర్చిదిద్దాలని సూచించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో, సాలూర తహశీల్దార్ శశిభూషణ్, ఏడీఏ వాజిద్ హుస్సేన్, మైనారిటీ కార్పోరేషన్ చైర్మెన్ తాహేర్, గంగాశంకర్, రావుబా గంగాధర్ మాజీ ఎమ్మెల్సీ అధికం నర్సారెడ్డి, ఏఎంసీ వైస్ చైర్మెన్ చీల శంకర్, మందర్న రవి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి

- **డిఐఈఓ రవికుమార్**



నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ పార్టీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిఐఈఓ రవికుమార్ పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని ప్రణాళికబద్ధంగా చదివి భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలని సూచించారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు బానిస కాకుండా కష్టపడి చదవాలని కోరారు. అనంతరం విద్యార్థులు సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో నిజామాబాద్ ప్రభుత్వ గర్ల్స్ కాలేజ్ ప్రిన్సిపాల్ గంధం బుద్ధి రాజ్, ప్రభుత్వ జూనియర్ కళాశాల బాయ్స్ ఆర్మూర్ ప్రిన్సిపాల్ విజయనంద్ రెడ్డి, ప్రభుత్వ జూనియర్ కళాశాల భీంగల్ ప్రిన్సిపాల్ జైపాల్ రెడ్డి,ప్రభుత్వ జూనియర్ కళాశాల మోర్తాడ్ ప్రిన్సిపాల్ గంగాధర్, జిజేఎల్ఏ జాయింట్ సెక్రెటరీ సురేష్ బాబు,475 అసోసియేషన్ ప్రెసిడెంట్ లక్ష్మీనారాయణ,711 అసోసియేషన్ ప్రెసిడెంట్ భాస్కర్, ఎస్సీ,ఎస్టీ యూనియన్ ప్రెసిడెంట్ రాజేష్, కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది పాల్గొన్నారు.

కోనసముందర్‌లో విద్యార్థుల సంబరాలు


షీల్డులు గెలుచుకున్న జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని కోన సముందర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులు విజయోత్సవ సంబరాలు చేసుకున్నారు. ఇటీవల జరిగిన మండల అంతర్ పాఠశాలల క్రీడా పోటీల్లో 8 షీల్డులు గెలుపొందిన సందర్భంగా ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పాఠశాలలో అభినందన కార్యక్రమాన్ని నిర్వహించి అంతర్ పాఠశాలల క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. భవిష్యత్తులోనూ విద్యార్థులు రాష్ట్ర జాతీయస్థాయి క్రీడల్లో రాణించి గ్రామానికి పేరు తీసుకురావాలని పలువురు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆనందంతో నృత్యాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధన్పాల్, పిఈటి రమేష్ గౌడ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కాంతి సాయన్న, ఉపాధ్యక్షులు రాజా గంగారం, పోతనక లింబయ్య, ఉపాధ్యాయుల బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

నవతెలంగాణ-భీంగల్ రూరల్
భీంగల్ మండల అంతర్ పాఠశాల క్రీడోత్సవాలలో భాగంగా ఈ రోజున వాలీబాల్ కోకో ఈవెంట్లను నిర్వహించడం జరిగింది మరియు అట్లాంటిక్ ను కూడా నిర్వహించడం జరిగింది. ఇందులో వాలీబాల్ అండర్ 14 బాయ్స్ ఫస్ట్ ప్రైస్ కృషి హై స్కూల్ భీమ్గల్, సెకండ్ ప్రైజ్ శ్రీ సరస్వతి విద్యా మందిర్ భీంగల్ విజేతలుగా నిలిచారు. విజేతలకు శ్రీ శివ సాయి హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ సాయికుమార్ మరియు క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ డాక్టర్ అనిల్ కుమార్, మండల క్రీడల కన్వీనర్ స్వామి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పిఈటిఏ అధ్యక్షులు విద్యాసాగర్ రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రెటరీ రమణమూర్తి, పీజీ ఎంఎస్ పి ఆర్‌టీయు మండల అధ్యక్షులు ఎడ్ల శేఖర్, ప్రధాన కార్యదర్శి రాస దయాకర్ పాల్గొన్నారు.

శుక్రవారం దేవి ఆలయానికి రాతి ముఖ ద్వారం ఏర్పాటు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండల కేంద్రం శివారులో హాస కొత్తూర్ రోడ్డులో ఉన్న శుక్రవారం దేవి ఆలయానికి గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ గుగ్గిలం రాజు రాతి ముఖ ద్వారాన్ని ఏర్పాటు చేయించారు. సుమారు లక్ష రూపాయలకు పైగా ఖర్చు చేసి ముఖ ద్వారాన్ని ప్రత్యేకంగా తయారు చేయించారు. మంగళవారం ఆలయ ప్రధాన గేటు వద్ద ఇప్పటివరకు ఉన్న ఇనుప గేటును తొలగించి జెసిబితో రాతి ముఖ ద్వారాన్ని నిలబెట్టారు. గుగ్గిలం రాజుకు గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు భోగ రామస్వామి, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పరిసరాల పరిశుభ్రతను కాపాడుకోవాలి

- **సత్యం, శాంతి చిహ్నం గాంధీజీ**
- **జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్,**
- **సీబీసీ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్**

నవతెలంగాణ-కంఠేశ్వర్/నిజామాబాద్ సిటీ
నిజామాబాద్ పాలిటెక్నిక్ కళాశాలలో సీబీసీ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం పాలిటెక్నిక్ కళాశాలలో స్వచ్ఛత హి సేవా అవగాహన కార్యక్రమం శ్రమదానంతో పాటు ముందస్తుగా గాంధీ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ చిత్రపటానికి జిల్లా యువజన అధికారి శైలి బెల్లాల్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ ఫీల్డ్ పబ్లిసిటీ ఆఫీసర్ బి.ధర్మ నాయక్, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నరేష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సత్యం, శాంతికి చిహ్నంగా నిలిచిన గాంధీజీని ప్రతి ఒక్కరూ స్మరించుకోవలసిన అవసరం ఉందన్నారు. స్వభావ్ స్వచ్ఛత - సంస్కార్ స్వచ్ఛత నినాదంతో ఈ ఏడాది స్వచ్ఛత హి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. స్వచ్ఛతను ఓ జీవన విధానంగా మార్చుకోవాలన్నారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు తడి చెత్త పొడి చెత్తను ఇలా వేరు చేయాలని అంశంపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాలిటెక్నిక్ కళాశాల మైదానంలో శ్రమదానం చేశారు. ఈ కార్యక్రమంలో సిబిసి ఎఫ్ పీఏ రషిద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు, ఎన్ సిసి అధికారులు, ఎన్ఎస్-ఎస్ వాలింటర్లు పాల్గొన్నారు.


స్వచ్ఛతాహీ సేవలో పాల్గొన్న విద్యార్థులు

6న భారీ బహిరంగ సభ

నవతెలంగాణ - బాల్కొండ
తెలంగాణ బిసి సంక్షేమ సంఘం నిజామాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తెలంగాణ ఫంక్షన్ హాల్‌లో ఈనెల 6న భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని బీసీ సంక్షేమ సంఘం ఉద్యమ నాయకులు అబ్బగోని అశోక్ గౌడ్ మంగళవారం తెలిపారు. ఈ బహిరంగ సభకు తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు వ్యవస్థాపకులు మేకపోతుల నరేందర్ గౌడ్ హాజరవుతారని అన్నారు. ఈ సభకు ప్రజలు అత్యధిక సంఖ్యలో విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి దాసరి మూర్తి, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు నారాగౌడ్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్యామ్, నియోజకవర్గం అధ్యక్షుడు బండి మల్లేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఓదార్పు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
మండలంలోని హాసకొత్తూర్ గ్రామంలో పలు బాధిత కుటుంబాలను బాల్కొండ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ముత్యాల సునీల్ కుమార్ మంగళవారం ఓదార్చారు. అనారోగ్యంతో మరణించి పత్రి రాజేశ్వర్, గంగారం, పెద్ది నిఖిల్ పాలెపు లింగన్న ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపాన్ని తెలియజేశారు. వారి అనారోగ్యాలకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కమ్మర్ పల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పాలెపు నర్సయ్య, కిషన్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు పడిగెల ప్రవీణ్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఓసి అందజేత

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టణం లోని మామిడిపల్లి 7వ వార్డుకు చెందిన గంగామణి అనారోగ్యంతో బాధపడుతుండటంతో విషయం తెలుసుకున్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి మంగళవారం ఎల్ఓసి అందజేశారు. నిమ్స్ ఆస్పత్రిలో వారిని చేర్పించి వారికి చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా 2,50,000/- రూపాయలను వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిబాబా గౌడ్, చిట్టి రెడ్డి, శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మ వరకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి

- **అధికారులను, సిబ్బందిని ఆదేశించిన మున్సిపల్ కమిషనర్**

నవతెలంగాణ-కంఠేశ్వర్
నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని రఘునాథ చెరువు మినీ ట్యాంక్ బండ్ ప్రాంతాన్ని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మంద మకరంద్ మంగళవారం ఈ ఈ తోపాటు సంబంధిత అధికారులు సిబ్బందితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ప్రస్తుతం దసరా పండగ నేపథ్యంలో మహిళలు పెద్ద ఎత్తున బతుకమ్మ ఆడతారని అందుకు అనుగుణంగా బతుకమ్మ పండగ ను పురస్కరించుకొని రఘునాథ చెరువు, మినీ ట్యాంక్ బండ్ ప్రాంతంలో అన్ని ఏర్పాట్లు చేయాలని నిజామాబాద్ మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ అధికారులను సంబంధిత సిబ్బందిని తదితరులను ఆదేశించారు. త్వరితగతిన పనులు పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాన్ని ఛేదించిన వారియర్ పీసీ బి.సాగర్

నవతెలంగాణ-ముప్కాల్
మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన మోసపోయిన ఖాతాదారుడు ఆగస్టు 3న ఆన్లైన్‌లో సైబర్ నేరానికి గురై రూ.1,14,998 రూపాయలను పోగుట్టుకున్నాడు. వెంటనే సదరు వ్యక్తి స్థానిక పోలీస్ స్టేషన్లో పిర్యాదు చేశారు. పిర్యాదు స్వీకరించిన పోలీసులు వెంటనే స్పందించి డబ్బులను రికవరీ చేశారు. ఇందులో ముఖ్య పాత్ర వహించిన సైబర్ వారియర్ పీసీ బి.సాగర్ సైబర్ క్రైమ్ పోర్టల్‌లో రిపోర్ట్ చేసి రూ.1,14,998 రూపాయలను హెూల్డ్‌లో పెట్టి కేసును ఛేదించారు. ఈ సందర్భంగా మంగళవారం సైబర్ మోసానికి గురైన బాధితుడికి డబ్బులను ఖాతాలోకి జమ చేశారు. కేసులో ముఖ్య పాత్ర వహించిన పీసీ సాగర్‌ను ఎస్ఐ రజినీకాంత్ అభినందించారు. అనంతరం ఎస్ఐ రజినీకాంత్ మాట్లాడుతూ ఆన్లైన్‌లో మోసపోయిన వారు వెంటనే 1930 కాల్ చేయడం లేదా దగ్గరలో గల పోలీస్ స్టేషన్ కు వచ్చి పిర్యాదు చేయాలని సూచించారు..

రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి విద్యార్థులు


ఎన్నికైన మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థులు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి
రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు మిసిమి ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ బాలీ రవీందర్ తెలిపారు. మంగళవారం ఆర్మూర్ మండలంలోని గురుకుల పాఠశాలలో జరిగిన హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి మిసిమి పాఠశాల విద్యార్థులు జయశ్రీ, శాలిని, పౌలాస్య, నేహా, రవిచరణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా జట్టుకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. ఎంపికైన విద్యార్థులు హైదరాబాద్‌లో ఈ నెల 9, 10,11 తేదీల్లో జరిగే 53వ రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను వ్యాయామ ఉపాధ్యాయులు దుర్గం సంజీవను పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో హెడ్మాస్టర్ కృష్ణ చైతన్య, ఉపాధ్యాయ బృందం, తదితరులు పాల్గొన్నారు.

7న ప్రజావేదిక

నవతెలంగాణ-ఏర్గట్ల
గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా సామాజిక తనిఖీ బందం వారు మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, జరిగిన పనులను తనిఖీ చేస్తున్నారని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు మంగళవారం తెలిపారు. తనిఖీలు పూర్తి కాగానే ఈ నెల 7న మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

పీహెచ్‌సీలో మందులు, ల్యాబ్ పరిశీలన

- **ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ చేసిన జిల్లా వైద్య,ఆరోగ్య అధికారి**

నవతెలంగాణ-బాల్కొండ
మండల కేంద్రంలోని కిసాన్ నగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం జిల్లా వైద్య,ఆరోగ్య అధికారిని రాజశ్రీ, డిప్యూటీ డిఎంహెచ్ఓ డాక్టర్ రమేష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పిహెచ్‌సి పరిధిలో సీజనల్ వ్యాధుల ప్రభావం, గర్భిణీలకు అందిస్తున్న చికిత్సలపై మెడికల్ ఆఫీసర్ స్రవంతిని అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రిలోని మందులు, ల్యాబ్, ఓపి రికార్డ్‌లను పరిశీలించారు.


తనిఖీ చేస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య అధికారి

పెన్షన్ పక్కదారి పట్టొద్దు

- **బయోమెట్రిక్ కోఆర్డినేటర్ రమేష్**

నవతెలంగాణ-ధర్పల్లి
ప్రభుత్వం పేద వృద్ధులకు అందిస్తున్న ఆసరా పెన్షన్ పక్కదారి పట్టకుండా పకడ్బందీగా అర్హులకు అందించాలని మండల బయోమెట్రిక్ కోర్డినేషన్ రమేష్ అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని దుబ్బాక గ్రామములో ప్రతినెలా అందించే పెన్షన్ తీరును పరిశీలించారు. అనంతరం అయన మాట్లాడుతూ కొన్ని గ్రామాల్లో వృద్ధులకు అందించే పెన్షన్ పక్కదారి పడుతుందని ఆరోపణలు వస్తున్నా దృశ్యా తనిఖీలు చేస్తున్నారన్నారు. బయోమెట్రిక్ చేతి ముద్రలు రాని వారికి గ్రామ కార్యదర్శి వేలిముద్ర ద్వారా పెన్షన్ అందిస్తున్నట్టు తెలిపారు. సందర్భాల్లో కొన్ని చోట్ల గ్రామ కార్యదర్శి, పెన్షన్ పంచే పోస్టు మెన్లు కలిసి చనిపోయిన వ్యక్తుల పేరున డబ్బులు నొక్కేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, తీరు మార్చుకోకపోతే చర్యలు తప్పవని అన్నారు. మరి కొన్ని చోట్ల 2 వేల 16 రూపాయలకు 16 రూపాయలు తక్కువ ఇస్తున్నారని తెలిసిందని, అందుకే తనిఖీలు చేస్తున్నామని తెలిపారు. ఇలాంటి ఘటనలు జరుగుతే ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకుంటామని అన్నారు.


మాట్లాడుతున్న బయోమెట్రిక్ కోఆర్డినేటర్

చేయూతనివ్వడం అభినందనీయం

- **బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి**

నవతెలంగాణ-ఎడపల్లి
మండల కేంద్రం లోని శ్రీ షిరిడి సాయిబాబా 14వ వార్షికోత్సవం సందర్భంగా బోధన్ నియోజకవర్గ శాసనసభ్యులు పొద్దుటూరి సుదర్శన్ రెడ్డి మంగళవారం ఆలయాన్నిసందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డికి భక్తులు ఆలయ కమిటీ నిర్వాహకులు వెంకటేశ్వర శర్మ స్వాగతం పలికారు. ఆలయవిశిష్టత గురించి వెంకటేశ్వర శర్మను అడిగి తెలుసుకున్నారు. గురుకుల పాఠశాలకు శ్రీ షిరిడి సాయిబాబా ఆలయ వ్యవస్థాపకులు ఆర్థిక చేయూత ఇవ్వడం పట్ల వెంకటేశ్వర శర్మను ఎమ్మెల్యే అభినందించారు. సాయిబాబా ఆలయంలో ప్రతి గురువారం అన్నదానం చేయడమే కాకుండా, స్వచ్ఛంద సేవా కార్యక్రమల్లో ముందుండి అభివృద్ధి పనులకు చేయూతనివ్వడం హర్షనీయమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పి తాజా మాజీ ఉపాధ్యక్షురాలు రజిత ఎల్లయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి, నిజామాబాద్ జిల్లా బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బిల్లా రామ్మోహన్, పార్టీ మండల అధ్యక్షుడు పులి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ శంకర్ నాయుడు, నాయకులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఆసుపత్రిలో చేరిన ఎమ్మెల్సీ కవిత

నవతెలంగాణ -కంఠేశ్వర్
బీఆర్ఎస్ నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మంగళవారం హైదరాబాద్‌లోని ఒక ప్రైవేట్ హాస్పిటల్ లో చేరారు. వైద్య పరీక్షల కోసం ఆసుపత్రిలో చేరిన ఎమ్మెల్సీ కవితకు డాక్టర్లు నిర్వహించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కేసులో తీహార్ జైలు లో ఉన్న సమయంలో ఎమ్మెల్సీ కవిత గైనిక్ సమస్యలు, తీవ్ర జ్వరంతో పలు సార్లు తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. గతంలో ఢిల్లీలో ఎయిమ్స్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా గైనిక్ సమస్యతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అవే సమస్యలతో మరోసారి ఆసుపత్రిలో చేరారు. మరి కొన్ని రోజుల్లో బతుకమ్మ ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో అందులో పాల్గొంటారా.. లేదా అని ప్రచారం జరుగుతుంది. అలాంటి సమయంలో కవిత ఆసుపత్రి కి వైద్యం కోసం చేరడం పట్ల ఆమె అభిమానులు పార్టీ నాయకులు ఆమె రాక కోసం ఎదురుచూస్తున్నారు.

పట్టభద్రులు ఓటరుగా నమోదు చేసుకోవాలి

నవతెలంగాణ-ఆర్మూర్
పట్టభద్రులు కచ్చితంగా తమ ఓటును నమోదు చేయించుకొని ఓటు హక్కును వినియోగించుకోవాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సైతం బిజెపి అభ్యర్థినే గెలిపించాలని, 2019లో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేయించుకున్న వారు సైతం కచ్చితంగా ఓటు హక్కు కోసం ఓటరు నమోదు చేయించుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. "ఆదిలాబాద్ - కరీంనగర్ - నిజామాబాద్ - మెదక్" ఉమ్మడి జిల్లాల పట్ట భద్రులు ఎమ్మెల్సీ ఓటర్ నమోదు కోసం తనను అసెంబ్లీ కన్వీనర్ గా చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. అసెంబ్లీలోని ఆరు మండలాల నుండి కన్వీనర్లను నియమించినట్టు తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ సంబంధించి 18 ఫామ్, టీచర్స్ ఎమ్మెల్సీ సంబంధించి 19 ఫామ్ నింపాలని అన్నారు. 6 నవంబర్ 2021 కన్నా ముందు డిగ్రీ పూర్తయిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కు అర్హులని తెలిపారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటరు నమోదు అసెంబ్లీ కన్వీనర్ జెస్సు అనిల్ కుమార్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల్ అధ్యక్షులు రోహిత్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి పులి యుగంధర్, ఓబీసీ మోర్చ పట్టణ అధ్యక్షులు బాసెట్టి రాజ్ కుమార్, బీజేవైఎం పట్టణ, మండల ప్రధాన కార్య దర్శులు ఉదయ్ గౌడ్, సతీష్ బబ్లు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు, డెస్క్ బెంచీలు అందజేత

నవతెలంగాణ-ఏర్గట్ల
మండలంలోని జిల్లా పరిషత్ తడపాకల్ పాఠశాలకు ప్రముఖ పారిశ్రామిక వేత్త, విద్యా వేత్త, ఏనుగు దయానంద్‌రెడ్డి విద్యార్థులకు రూ.50వేలు విలువచేసే క్రీడా సామగ్రిని, 25 బెంచ్‌లను మంగళవారం అందించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామకమిటీ సభ్యులు దయానంద్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు.



నవతెలంగాణ
కామారెడ్డి
బుధవారం | అక్టోబర్ 02, 2024 | www.navatelangana.com

తల్లిని చంపిన కొడుకుకు మూడేండ్ల జైలు

నవతెలంగాణ-పెద్దకొడప్ గల్

పెద్ద కొడప్ గల్ మండల కేంద్రానికి చెందిన ఒడ్డె నాగవ్వను 2021 సంవత్సరంలో ఆమె కొడుకు నర్సింహులు హత్య చేయగా ఈ కేసులో నర్సింహులకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు 5 వేల రూపాయల జరిమానా విదిస్తూ కామారెడ్డి జిల్లా కోర్టు మంగళవారం తీర్పు వెలువరించింది. మండల కేంద్రానికి చెందిన ఒడ్డె నాగవ్వ కుమారుడు నర్సింలు ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ మద్యంకోసం తన తల్లిని డబ్బులు కావాలని డిమాండ్ చేయగా, నాగవ్వ డబ్బులు ఇవ్వకపోవడంతో ఆగ్రహించిన నర్సింలు ఆమెను కట్టెతో కొట్టడంతో గాయాలపాలై మరణించింది. అప్పటి ఎస్సై విజయ్ కొండ కేసు నమోదు చేసి కోర్టుకు సరియైన సాక్ష్యాధారాలను సమర్పించడంతో కోర్టు నర్సింలు లకు 3 సంవత్సరాల జైలు శిక్షతో పాటు, 5 వేల రూపాయల జరిమానా విధించింది. ఈ కేసులో నిందితునికి శిక్ష పడేలా కృషి చేసిన అప్పటి బిచ్కుంద సీఐ కృష్ణ పెద్దకొడప్ గల్ ఎస్ఐ విజయ్ కొండను జిల్లా ఎస్పి సింధూశర్మ అభినందించారు.

ఖాతాలో 15 లక్షలు వేసి.. ధర్నా చేయండి

- జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నారెడ్డి మోహన్ రెడ్డి

నవతెలంగాణ-రామారెడ్డి

ప్రజలకు ఇచ్చిన గత హామీ నల్లధనాన్ని తీసుకొచ్చి ప్రతి ఇంటికి బ్యాంకు ఖాతాలో రూ.15 లక్షలు వేసిన తరువాత బిజెపి నాయకులు ధర్నా చేయాలని జిల్లా పరిషత్ మాజీ ఫ్లోర్ లీడర్ నా రెడ్డి మోహన్ రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బిజెపి పాలిస్తున్న రాష్ట్రాల్లో ఎక్కడైనా రూ.2లక్షల రుణమాఫీ చేసిన దాఖలాలు ఉన్నాయా అని, తెలంగాణకు బిజెపి నాయకులు చేసింది ఏంటిని, బడ్జెట్లో మన వాటా ఎంతని, ఎంత కేటాయించారని వీటన్నిటిపై ఆత్మ పరిశీలన చేసుకొవలని సూచించారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్లి ఢిల్లీలో ధర్నా చేయండి, అప్పుడు తెలంగాణకు న్యాయం జరుగుతుందని, కులమతాలపై రాజకీయం చేయడం ప్రజాస్వామ్యం దేశంలో సరైనది కాదని పేర్కొన్నారు.


కామారెడ్డి: అక్షరా పాఠశాలలో బతుకమ్మ ఆడుతున్న విద్యార్థినిలు, ఉపాధ్యాయులు


రామారెడ్డిలో...


లింగంపేట్‌లో...

పాఠశాలల్లో బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని అక్షరా ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ఘనంగా మంగళవారం నిర్వహించారు. పాఠశాల ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు అక్షర ఉన్నత పాఠశాలలో రంగు రంగుల పూలతో బతుకమ్మను పేర్చి సందడిగా బతుకమ్మ ఆటలాడారు. బొడ్డెమ్మతో మొదలై ఎంగిలిపూల బతుకమ్మ, సద్దుల బతుకమ్మ ఇలా దేనికదే ప్రత్యేకతగా సద్దుల బతుకమ్మ రోజు గౌరమ్మను సాగానంపడంతో సంబరాలు ముగుస్తాయనీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సంగీతరెడ్డి అన్నారు. కార్యక్రమంలో అక్షర పాఠశాల చైర్మన్ అశోక్‌రెడ్డి, కరస్పాండెంట్ శ్రీ లోకేష్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థినిలు పాల్గొన్నారు.

రామారెడ్డి : మండలంలోని ఆయా పాఠశాలలో, గ్రామాల్లో ప్రకృతిలో దొరికే వివిధ రకాల పువ్వులతో బతుకమ్మను పేర్చి మంగళవారం ఆడి పాడారు. ఆయా పాఠశాల విద్యార్థిని నేటి నుంచి సెలవులు రావడంతో బతుకమ్మ పండగ నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని బాలికలు ఉన్నత పాఠశాలలో విద్యార్థినిలు బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. తెలంగాణ సంస్కృతికి చిహ్నామైన బతుకమ్మలను బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శోభారాణి ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయినీలు, విద్యార్థునీలు కలిసి ఘనంగా బతుకమ్మ సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు, విద్యార్థినిలు ఉన్నారు.

పెద్దకొడప్‌గల్ : మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కమల ఆధ్వర్యంలో ముందస్తు బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు గునుగు, బంతితో పాటు వివిధ రకరకాల పూలతో బతుకమ్మను అందంగా ముస్తాబు చేసి డీజే పాటలకు నృత్యాలు చేస్తూ ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గ్రామ సమీపాన గల చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలు

సదాశివనగర్ : తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల కామారెడ్డి (మర్కల్) నందు బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. విద్యార్థినులు ఉత్సాహంగా పాల్గొని ఆటపాటలతో అలరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సి. శోభారాణి, వైస్ ప్రిన్సిపాల్స్ ఉదయిని, శ్రావణి, కల్చరల్ కమిటీ కో ఆర్డినేటర్ సింధూర, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్ : మద్నూర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేందర్ మాట్లాడుతూ మహిళలకు ప్రత్యేకంగా ఆనందాన్ని కలిగించే ముఖ్యమైన పండుగ బతుకమ్మ పండుగ అని తెలిపారు. ఈ బతుకమ్మ పండుగ సంబరాల్లో పాఠశాల మహిళా ఉపాధ్యాయురాలు ఇతర ఉపాధ్యాయులు విద్యార్థినిలు పాఠశాల సిబ్బంది, పాల్గొన్నారు.


సదాశివనగర్: పూలతో బతుకమ్మ పేరుస్తున్న డిగ్రీ విద్యార్థినిలు


పెద్దకొడప్‌గల్‌లో...


మద్నూర్‌లో...

చేపల పెంపకంపై అవగాహన

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో గల మండల సమైక్య కార్యాలయంలో చేపల పెంపకం పెంపకంపై లబ్ధిదారులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎల్డీఎం రవికాంత్ పెంపకంలో పాటించాల్సిన మెలకువలను పీఎంఈజీపి ద్వారా పొందే లోన్ విధివిధానాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల సమైక్య అధ్యక్షురాలు బెస్త శాంత, ఐకెపి డిపిఎం రమేష్ బాబు, స్థానిక యూనియన్ బ్యాంక్ మేనేజర్ సాగర్ షిండే, జిల్లా ఫిషరీస్ కార్యాలయం అసిస్టెంట్ సురేష్ గౌడ్, ఉదయ్ ఆక్వా కార్తీక్, ఏపీ ఎం జగదీష్, సీసీలు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-లింగంపేట్

కేంద్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న బీమా పథకాలన్నీ పీఎం జీవన్ జ్యోతి, బీమా యోజన, పిఎం సురక్ష బీమా, యోజన పథకాలను ప్రజలు సద్వినియోగం చూసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకులు రాజారాం నాగరాజు అన్నారు. సోమవారం పత్రికలకు ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ఉపాధి కూలీలు, ఆటోడ్రైవర్, డ్వాక్రా మహిళలు, కల్లు గీత కార్మికులు, భవన నిర్మాణం కార్మికులు ఇలాంటి రంగంలో ఉన్న వారందరూ ఈ పథకం కింద నమోదు చేసుకోవాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో గేదె మృతి

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని భవానిపేట గ్రామ సమీపంలో విద్యుత్ షాక్ తగిలి గేదె మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ప్రకారం.. గ్రామానికి చెందిన కొత్తూరు కిషన్‌కు సంబంధించిన గేదె భవాని పేటశివారు సమీపంలో మేతమేస్తుంది. వ్యవసాయ భూమిలో సర్వీస్ వైరు తెగి కింద పడడంతో గేదె మేసుకుంటుపోయి విద్యుత్ వైర్‌కు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. పాలిచ్చేది గేదె మృతి చెందింది. దాని విలువ సుమారు రూ.50వేలు ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలని బాధితుడు కోరారు.

ఆర్చరీలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని సిద్ధ రామేశ్వర నగర్ గ్రామానికి చెందిన దండు అనిల్ కుమారుడు అకుల్ అండర్ 14 ఆర్చరీ పోటీలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయిలో జరిగిన పోటీలలో మొదటి స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి అర్చరి పోటీలకు ఎంపికైనట్లు కుటుంబీకులు తెలిపారు. ఈ సందర్భంగా పట్టణ కేంద్రంలోని చైతన్య విద్యానికేతన్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నాడు. అకుల్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవడం పట్ల పాఠశాల యాజమాన్యం అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రేణుకుమార్, ప్రధానోపాధ్యాయులు అశోక్ యాదవ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఉన్నారు.

మొక్కలతోనే మానవమనుగడ

నవతెలంగాణ-దోమకొండ

దోమకొండ మండల కేంద్రం లోని జిల్లా కోపరేటివ్ సహకార శాఖ బ్యాంకు వద్ద మేనేజర్ శృతి వాణి ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా - స్వచ్ఛ భారత్ దివాస్ కార్యక్రమం లో భాగంగా మంగళవారం మొక్కను నాటి నీళ్ల పోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మొక్కలతోనే మానవ మనుగడ ఉందని, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షణ చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిఈవోబాల్‌రెడ్డి, రాంచంద్రం, అసిస్టెంట్ మేనేజర్ రవీందర్, సిబ్బంది ఉన్నారు.

విద్యార్థికి ట్రాక్ సూట్ అందజేత

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని జంగంపల్లి గ్రామంలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థి కావేరి జిల్లాస్థాయి కరాటే పోటీలకు ఎంపికైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా గ్రామ మాజీ సర్పంచ్ నర్సింలు యాదవ్ పోటీలకు ఉపయోగపడే ట్రాక్ సూట్ ను విద్యార్థికి అందజేశారు. పోటీలో గెలుపొంది గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

ఎంపీడీవో కార్యాలయంలో మెడికల్ క్యాంప్

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీవో రాజ్ కిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేసి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు దివ్య గ్రామపంచాయతీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న 102 మంది మల్టీపర్పస్ వర్కర్లకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అలాగే మల్టీపర్పస్ వర్కర్లకు ఐడెంటి కార్డులు జారీ చేశారు. అనంతరం మండల ప్రత్యేక అధికారి రజిత పల్లె ప్రకృతి వనం, డివైడర్లలో నాటిన మొక్కలను, అంగన్వాడీ కేంద్రాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈ ఓ వెంకటరమణ, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శి మహేష్ గౌడ్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

నవతెలంగాణ-భిక్కనూర్

ప్రతి రైతుకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రైతు భరోసా పథకం కింద ప్రతి రైతుకు ఎకరానికి 15000 చొప్పున నిధులు వెంటనే విడుదల చేయాలని మండలంలోని అంతంపల్లి గ్రామంలో మంగళవారం సొసైటీ తీర్మానించింది. 59వ వార్షిక మహాజనసభను చైర్మన్ వెంకటరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. సంఘంలో అప్పు ఉండి రెగ్యులర్ గా ఉన్నవారికి డివిడెంట్ పంపిణీ చేయుటకు తీర్మానించారు. అలాగే లావణి భూములకు ఎకరానికి 30 వేలు కాకుండా పట్టా భూములకు ఇచ్చే విధంగా ఇవ్వాలని తీర్మానించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు రాజిరెడ్డి, సంఘం మాజీ అధ్యక్షుడు కిషన్ రావు, పాలక వర్గం సభ్యులు, సీఈఓ శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

గ్రామ సభలను విజయవంతం చేయాలి

నవతెలంగాణ-దోమకొండ

మహాత్మా గాంధీ జయంతి సంధర్భంగా మండలంలోని అన్నీ గ్రామ పంచాయతీలలో బుధవారం నిర్వహించే గ్రామ సభకు గ్రామంలోని అన్నీ శాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలి అని మండల ప్రత్యేకాధికారి జ్యోతి , ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ లు తెలిపారు. దోమకొండ మండల పరిషత్ కార్యలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం లో గ్రామసభలో భాగంగా గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్లాన్ (జీపిడిపి) ల్లో భాగంగా 9 థీమ్స్ పై గ్రామస్థులు, నాయకులు ఆయా శాఖల ఆధ్వర్యంలో గ్రామ సభ సమావేశంలో తీర్మానం చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి జ్యోతి, ఏ పి వో రజని పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిశుభ్రత.. ప్రతిఒక్కరి బాధ్యత

- మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ

నవతెలంగాణ-కామారెడ్డి



కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని రాశి వనంలో స్వచ్ఛతహి సేవ కార్యక్రమంలో మున్సిపల్ పరిధిలోగల 14 వార్డులోని మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, మాస్ క్లీనింగ్ డ్రైవ్ లో మంగళవారం పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు మహమ్మద్ షబ్బీర్ అలి సూచన మేరకు కాలనీలో శుభ్రం చేయడం జరిగినద చైర్పర్సన్ అన్నారు. చుట్టుపక్కల ఉండే ప్రదేశాలను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని గడ్డం ఇందు ప్రియ ఆ కాలనీ వాసులను కోరారు. బయట ఆవరణంలో శుభ్రం చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. స్వచ్ఛతాహి సేవలో భాగంగా కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలో గల వివిధ విద్యాసంస్థల పిల్లలకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీ లు నిర్వహించడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సుజాత, డిగ్రీ కళాశాల ఉపాధ్యాయులు విద్యార్థులు, సానిటరీ ఎస్సై పర్వేజ్, మోమిన్, తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజులు మేల్కోవాలి

- ఆర్థిక, అక్షరాస్యతలో వెనుకబడుతున్నాం : జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్థిక, అక్షరాస్యతలో వెనబడిన ముదిరాజ్ జాతి తన రాజకీయ వాటాను కోల్పోతుందనీ కామారెడ్డి జిల్లా అధ్యక్షులు డాక్టర్ భట్టు విఠల్ ముదిరాజ్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ముదిరాజ్ సంఘ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ బద్ధంగా ముదిరాజులకు రావాల్సిన వాట సాధించడంలో విఫలమైన తెలంగాణ ముదిరాజ్ జాతియే అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ముదిరాజులారా ఇకనైనా మేల్కొండని ముదిరాజులకు పిలుపు ఇచ్చారు. ఐఐటి, త్రిబుల్ ఐటీ, నెట్ వంటి ప్రతిష్టాత్మక సాంకేతిక కోర్సులలో సైతం సీట్లు సాధించలేక వెనుకబడి పోతున్నారు. కారణం ఆర్థిక స్థోమత లేకపోవడంతో పోటీ పరీక్షలను ఎదుర్కొన గలిగే నాణ్యమైన విద్యను అందుకోలేక పోవడమనేది నిజం కాదా అన్నారు. బాలికల పరిస్థితి చాలా దారుణంగా ఉందన్నారు. ఉన్నత పాఠశాల స్థాయిలోనే చాలా మంది బాలికలు డ్రాప్ అవుట్ అవుతున్నారు. కళాశాల స్థాయికి చేరటం లేదనీ, చేరినా కళాశాలలో విద్య పూర్తి చేయడం లేదనీ, సాంకేతిక విద్యలో మన గ్రామీణ ముదిరాజ్ బాలికలు కనీస సంఖ్య కూడా లేరు అని పేర్కొన్నారు. ముదిరాజ్ జాతికి రావల్సిన వాటకై ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొరివి నర్సింలు, సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ రక్తదాతలకు సన్మానం

నవతెలంగాణ-కామారెడ్డి/లింగంపేట్

జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్సవం సందర్భంగా కామారెడ్డి జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి లో రక్తదాతలకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దీంట్లో భాగంగా 17 సంవత్సరాల నుండి వ్యక్తిగతంగా 74 సార్లు రక్తదానం, తల సేమియా చిన్నారుల కోసం రక్తదాన శిబిరాలను ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతున్న వారికి కావలసిన రక్తాన్ని సకాలంలో అందజేస్తున్నందుకుగాను ఐవీఎఫ్ సేవాదళ్ రాష్ట్ర చైర్మన్ రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలుకు పురస్కారం అందజేశారు. అదే విధంగా జిల్లా రక్తదాతల సేవా సమితి ప్రారంభించి 15 సంవత్సరాలలో ఎన్నో వేల మందికి రక్తదానం చేయించి, ఎంతోమంది ప్రాణాలను కాపాడిన సందర్భంగా బోనగిరి శివకుమార్, ముదాం శ్రీధర్ పటేల్‌కు ఉత్తమ రక్తదాత పురస్కారాన్ని వైద్యశాల సూపరిండెంట్ ప్రొఫెసర్ రామ్ సింగ్, డాక్టర్ ఫరీద,మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బన్సీలాల్‌లు సంయుక్తంగా అందజేశారు.

ఈ సందర్భంగా బాలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని, నిరుపయోగంగా ఉన్న సింగిల్ డోనర్ ప్లేట్ లెట్స్ యంత్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. దీనివలన డెంగ్యూ వ్యాధితో బాధపడే పేద మధ్యతరగతి ప్రజలకు ఉచితంగా వైద్య సహాయం అందుతుందని అన్నారు. రక్తదానానికి సహకరిస్తున్న రక్తదాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు.



కామారెడ్డి: రక్తదాతను సన్మానిస్తున్న పలువురు

బెస్ట్ మెటీ వెయిటర్ గా అవార్డు

లింగంపేట్ : రెడ్ క్రాస్ లింగంపేట్ అధ్యక్షులు బొల్లు శ్రీకాంత్ బెస్ట్ మేటి వెయిటర్ గా మంగళవారం అవార్డు అందుకున్నారు. కామారెడ్డి జిల్లామెడికల్ కాలేజ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన జాతీయ స్వచ్ఛం ద రక్తదాన దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లాలో అత్యధికంగా రక్తదాన శిబిరాలను నిర్వహించిన మండలంగా రెడ్ క్రాస్ సొసైటీ లింగంపేట్ మండల శాఖ ప్రభుత్వ మెడికల్ కాలేజ్ సూపర్డెంట్ డాక్టర్ రామ్ సింగ్ చేతుల మీదుగా ఉత్తమ మోటివేటర్ గా శాలువాతో సన్మానించి మెమొంటో అందజేశారు.

బీడీ కార్మికుల జీవనభృతి పెంచాలి

- సిపిఐ (ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ

నవతెలంగాణ-రామారెడ్డి

తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల హామీల్లో ఇచ్చిన బీడీ కార్మికుల జీవన భృతి రూ.4016 పెంచాలని సిపిఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు పి.రామకృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి, తహసీల్దార్ సువర్ణకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ.. బీడీ వర్కర్లకు కనీస పని దినాలు లేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతూ, జీవనం గడపడమే దినదిన గండంగా మారిందని తెలిపారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 నెలలు గడుస్తున్నా జీవన భృతిపై పెదవి విప్పటం లేదన్నారు. బీడీ కార్మికుల జీవన భృతి అందించాలని, లేదంటే అసెంబ్లీ ముట్టడి చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రమేష్, జిల్లా బీడీ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి ఏ ప్రకాష్, నాయకులు ఎండి అనీఫ్, బి కిషోర్, గోపాల్, వెంకన్న, ఎస్.కిషోర్, నరసవ్వ, సావిత్రి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

అర్హులందరికీ ఇందిరమ్మ ఇల్లు

- దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు :ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు

నవతెలంగాణ-మద్నూర్

రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు దక్కలన్నదే కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ లక్ష్యమని జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు దసరా పండుగ నాటికి ఇందిరమ్మ కమిటీలు పూర్తి చేయనున్నట్టు మంగళవారం తెలిపారు. కేంద్రం మంజూరు చేసే గృహాల్లో ఈసారి రాష్ట్రానికి గరిష్ట సంఖ్యలో సాధించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకోబోతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లపై సమీక్షించిన ముఖ్యమంత్రి అన్ని స్థాయిలో కమిటీల ఏర్పాటుకు ఒకటి రెండు రోజుల్లో విధివిధానాలను రూపొందించాలని సూచించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. జుక్కల్ నియోజకవర్గం లో అర్హులైన అందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కమిటీ నివేదికల ప్రకారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని ఎమ్మెల్యే తెలియజేశారు.

జిల్లా ఆర్యవైశ్య నాయకులకు సన్మానం

నవతెలంగాణ-రామారెడ్డి

జిల్లా ఆర్యవైశ్య మహాసభ రాజకీయ విభాగం ఎగ్జిక్యూటివ్ అధ్యక్షుడు, పడగల శ్రీనివాస్‌కు, జిల్లా యువజన విభాగం ఉపాధ్యాక్షుడు పోతు నూరి, ప్రసాద్‌లు నూతనంగా ఎన్నుకోబడ్డ సందర్భంగా వారికి శాలువాతో సన్మానించి పుష్పగుచ్చాలు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో గాంధారి మాజీ ఏఎంసీ చైర్మన్ సత్యం రావు, మాజీ ఎంపీపీ దశరథ్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ ముత్తినేని రవీందర్రావు, రవీందర్‌గౌడ్, శ్యామ్, కన్నపూర్ రాజిరెడ్డి, రాజేందర్, తదితరులు, ఉన్నారు.

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడికి జన్మదిన శుభాకాంక్షలు

నవతెలంగాణ-కామారెడ్డి

కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ జన్మదినం సందర్భంగా ఆయనను కాంగ్రెస్ నాయకులు మాజీ జెడ్పీటీసీ మోహన్‌రెడ్డి, మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్‌గౌడ్, మాజీ ఎంపిటిసి చంద్రాగౌడ్, జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కలిసి శాలువ, పుష్ప గుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు మంగళవారం తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని పదవులు అధిరోహించాలని వారు ఆకాంక్షించారు.

ఎస్‌జిఎఫ్ రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థి ఎంపిక

నవతెలంగాణ-భిక్కనూర్

భిక్కనూర్ పట్టణ కేంద్రంలోని విజ్ఞాన్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థి మణిదీప్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో నిర్వహించిన ఎస్ జి ఎఫ్ రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. ప్రతి విద్యార్థి చదువుతోపాటు, క్రీడారంగంలో రాణించాలని, విద్యార్థి రాష్ట్రస్థాయి పోటీలలో గెలుపొంది పాఠశాలకు, పట్టణానికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

ధ్వంసమైన డివైడర్ పరిశీలన

నవతెలంగాణ-ముప్కాల్

సోమవారం అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ముప్కాల్ మార్కెట్ యార్డ్ ప్రాంతంలోని పాత జాతీయ రహదారికి రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్ ప్రాంతంలో శివాజీ విగ్రహంను ప్రతిష్ఠించేందుకు డివైడర్‌ను జేసీబీ సహాయంతో ధ్వంసం చేశారని సీఐ శ్రీధర్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డివైడర్ మధ్యలో శివాజీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడం సరైంది కాదన్నారు. ఆర్అండ్‌బీ ఏఈ ప్రమీల మంగళవారం ఘటన స్థలాన్ని పరిశీలించారు. ఏఈ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నమన్నారు. కార్యక్రమంలో ముప్కాల్ ఎస్ఐ రజినీకాంత్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



ధ్వంసమైన డివైడర్‌ను పరిశీలిస్తున్న ఆర్అండ్‌బీ ఏఈ, పోలీసులు

ఆరు గేట్ల ద్వారా నీటి విడుదల

నవతెలంగాణ-మెండోర

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి గోదావరి నదిలోకి 6 గేట్ల ద్వార నీటి విడుదల కొనసాగుతోంది. ఎగువ ప్రాంతాల నుంచి 40,604 క్యూసెక్కుల వరద నీరు ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుండటంతో మిగులు జలాలు దిగువకు వదులుతూ గోదావరిలోకి 18 వేల 744 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు వరద కాలువ ద్వారా 12వేల క్యూసెక్కులు, కాకతీయ కాలువ ద్వార 6,800, ఎస్కేప్ గేట్ల ద్వారా 1200, లక్ష్మి కాలువ ద్వారా 150, సరస్వతి కాలువ ద్వార 500, గుత్ప ఎత్తిపోతలకు 270 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తు మిషన్ భగీరథ ద్వారా 231 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఆవిరి రూపంలో 709 క్యూసెక్కుల నీరుపోతోంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా మంగళవారం సాయంత్రానికి ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నీటిమట్టం కలిగి ఉంది.

మంచినీటిని అందించాలి

- ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ రాజేందర్ కుమార్
- ముగిసిన శిక్షణా తరగతులు

నవతెలంగాణ-రెంజల్/బాల్కొండ/మాక్లూర్



మాక్లూర్‌లో..

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మంచినీటి సహాయకుల శిక్షణ తరగతులను అవగాహన చేసుకుని గ్రామాలలోని ప్రజలకు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్సి రాజేందర్ కుమార్ స్పష్టం చేశారు. మంగళవారం గ్రామాల్లోని మంచినీటి సహాయకులకు నాలుగు రోజులుగా వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. శిక్షణ కాలంలో ప్రతిరోజు పరీక్షలు నిర్వహించి, వారికి ప్రశంస పత్రాలను అందజేశామన్నారు. తాగునీటి ఇబ్బందులు కలగకుండా సహాయకులు విధి నిర్మాణంలో ఇలాంటి నిర్లక్ష్యం చేయకూడదని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ డీఈ, ముని నాయక్, ఎంపీడీవో వెంకటేష్ జాదవ్, సూపరింటెంట్ హెచ్.శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ గబ్బర్ సింగ్, రిసోర్స్ పర్సన్స్, రెంజల్, ఎడపల్లి, మండలాలలో పనిచేస్తున్న గ్రామమంచినీటి సహాయకులు, మిషన్ భగీరథ సిబ్బంది పాల్గొన్నారు.

బాల్కొండ :మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో నీటి సహాయకులకు శిక్షణ తరగతులు మంగళవారం ముగిసాయి. మండల పరిధిలో నాలుగు రోజుల పాటు మంచి నీటి సహాయకులకు మండల కేంద్రంలోని రైతు వేదికలో శిక్షణ తరగతులు కొనసాగాయి. శిక్షణలో భాగంగా నీటి సహాయకులకు చేతి పంపులు రిపేర్, మోటార్ రిపేర్, ప్యానల్ బోర్డ్ రిపేర్, పైపులైన్‌ల రిపేర్లు, నీటి నాణ్యత ప్రమాణాలపై శిక్షణ ఇచ్చారు. శిక్షణ పూర్తి చేసిన నీటి సహాయకులకు మిషన్ భగీరథ డిఈ అమీర్ ఖాన్, ఏఈ సమీర్, ఏఈ బస్వరాజ్, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

మాక్లూర్:గ్రామాల్లో శుద్ధమైన నీటిని సరఫరా చేయాలని ఇంఛార్జి ఎంపీడీఓ, ట్రైనీ ఐఏఎస్ సంకేత్ కుమార్ తెలిపారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో నాలుగవ రోజు మంగళవారం పైపు లైన్, పైపులను ఏ విధంగా అమర్చాలనే దానిపై పై శిక్షణను ఇచ్చారు. ప్రతి గ్రామంలో మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు స్వచ్ఛంగా ఉండేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఇ గంగారాం, మండల పంచాయతీ అధికారి శ్రీనివాస్, ఏఇ లు అనిల్, గ్రామపంచాయతీ వాటర్ మెన్ లు పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినికి ఎంబీబీఎస్‌లో సీటు

విద్యార్థిని నిఖితను అభినందించిన ఉపాధ్యాయులు

నవతెలంగాణ-ఎడపల్లి



మండల పరిధిలోగల తెలంగాణ గురుకుల బాలికల పాఠశాల కళాశాలలో ఇంటర్ బైపీసీ పూర్తి చేసుకున్న అనంతరం కాంబ్లె నిఖిత ఇటీవల నిర్వహించిన నీట్ పరీక్షల్లో ప్రతిభ కనబరిచి ఎంబిబిఎస్ లో సీట్ సాధించినట్లు తెలంగాణ గురుకుల పాఠశాల కళాశాల ప్రధాన చార్యులు గంగా శంకర్ మంగళవారం తెలిపారు. నిరుపేద కుటుంబానికి చెందిన కాంబ్లె నిఖిత పట్టుదలతో కష్టపడి చదివి ములుగు ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబిబిఎస్‌లో సీటు సాధించింది. నిరుపేదలైన మండల కేంద్రానికి చెందిన కాంబ్లె నిఖితను తల్లిదండ్రులు ఎంతో కష్టపడిచదివించారు. తల్లిదండ్రుల ఆశయాలను, కలలను నెరవేర్చాలనే పట్టుదలతో నీట్ పరీక్షలకు సిద్ధమై విద్యార్థిని నీట్లో పరీక్షల్లో ప్రతిభ కనబరిచారు. కాంబ్లె నిఖితకు కాళోజి నారాయణరావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్స్ విభాగంలో ఎంబిబిఎస్ సీట్ సాధించుకుంది.. గురుకుల కళాశాల విద్యార్థిని కాంబ్లె నిఖితకు ఎంబిబిఎస్ సీట్ రావడం పట్ల ఎడపల్లి తెలంగాణ గంగా శంకర్, ఉపాధ్యాయులు అభినందించారు. విద్యార్థిని తల్లిదండ్రులు ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా అమ్రూద్ శేఖర్

నవతెలంగాణ-రెంజల్



మండల కేంద్రంలోని మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడిగా అమ్రాద్ శేఖర్ ఏకగ్రీవంగా ఎంపికైనట్టు ఆయన మంగళవారం తెలిపారు. నమ్మకంతో ఎన్నుకున్న మున్నూరు కాపు ప్రజలకు, పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలను అందిస్తూ అభివృద్ధి పథంలో నడిపిస్తానని ఆయన స్పష్టం చేశారు. ప్రధాన కార్యదర్శిగా కిలాజి సాయన్న ఉపాధ్యక్షులుగా ఆర్మూర్‌రెడ్డి సాయన్న, కస్ప హనుమన్లు, కోశాధికారిగా ఆర్మూర్ గణేష్, లోలపు శ్రీనివాస్, కటికల (పెద్దకాపు) కిలాజి నితిన్, సంయుక్త కార్యదర్శులుగా లోలపు నవీన్, లోలపు రాజేశ్వర్, సలహాదారులుగా మేక సాయికుమార్, గౌరవజీ గంగాధర్, తిరుపతి, అనిల్, ఆకుల బుజ్జి, గౌరవ అధ్యక్షులు లోలపు సురేష్, తదితరులు ఉన్నారు.

పోటీ పరీక్షల్లో సత్తా చాటిన చందర్‌నాయక్

నవతెలంగాణ-డిచ్‌పల్లి



డిఎస్సీ ఫలితాల్లో నిజామాబాద్ జిల్లా కోటగిరి మండలం సుద్దులం తాండాకు చెందిన దేవసోత్ చందర్ రాథోడ్ అత్యుత్తమ ప్రతిభతో మెరిశాడు. సాంఘిక శాస్త్రం విభాగంలో జిల్లాస్థాయిలో 37, ఎస్టీ కేటగిరిలో మొదటి ర్యాంకు సాధించారు. మరోపక్క ఇటీవల విడుదలైన హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో జోనల్ స్థాయిలో 1519, కేటగిరిలో 6వ ర్యాంకు సాధించాడు. ఒకేసారి రెండు ఉద్యోగాలకు ఎంపిక కావడం పట్ల ఆయన్ను పలువురు అభినందించారు. కాగా చందర్ రాథోడ్ తెలంగాణ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బి ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. 2018లో పంచాయతీ కార్యదర్శి ఉద్యోగం సాధించి దాదాపు రెండేళ్ళు రుద్రూర్ మండలం రాయకూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేశారు. అనంతరం డిఎస్సీ పరీక్షలకోసం పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాన్ని పక్కన పెట్టి కష్టపడి సన్నద్ధం అయ్యి స్కూల్ అసిస్టెంట్‌గా ఎంపికయ్యారు.

బైక్ చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

నవతెలంగాణ-బోధన్

బోధన్ పట్టణంలోని హైటెక్ బార్ వద్ద సోమవారం రాత్రి కొండల్ వాడి శంకర్ అనే వ్యక్తికి చెందిన ద్విచక్ర వాహనం నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు దొంగిలించారు. బాధితుడు పట్టణ పోలీస్‌స్టేషన్ లో మంగళవారం ఫిర్యాదు చేయగా సీఐ వెంకటనారాయణ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేశారు. సీసీ పుటేజీలను పరిశీలించగా దొంగతనానికి పాల్పడిన హబ్బు, గౌస్‌లను అరెస్టు చేసి విచారించారు. వారు నేరం ఒప్పుకున్నారని, వారి నుంచి ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకుని వారిని రిమాండ్ కు తరలించామని సీఐ వెంకటనారాయణ తెలిపారు.

ఘనంగా ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవం

నవతెలంగాణ-కంఠేశ్వర్/బాల్కొండ

జిల్లా కేంద్రంలో మహిళ, శిశు, దివ్యాంగుల, వయోవృద్ధుల, ట్రాన్స్ జెండర్స్, సంక్షేమ శాఖ ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవ వేడుకలు నిర్వహించారు. మంగళవారం జిల్లా సమీకృత జిల్లా కార్యాలయం నందు జిల్లా సంక్షేమ అధికారి, జిల్లా స్థాయి సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్స్, ఫోరం, ఫౌండేషన్స్, ట్రస్టులు, క్లబ్స్, సొసైటీల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, వృద్ధాశ్రమాల నిర్వాహకులు, వయో వృద్ధుల సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వృద్ధాశ్రమాల నిర్వాహకులు, సమగ్ర శిశు పథక అభివృద్ధి అధికారిణి ఆధ్వర్యంలో వృద్ధాశ్రమాల్లోని వయో వృద్ధులకు వినోద కార్యక్రమాలు, ఆటల పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సహకారంతో ఆరోగ్య శిబిరాలను ఏర్పాటు చేసి వారికి మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ వారోత్సవాల్లో భాగంగా ఓల్డ్ కలెక్టర్ కార్యాలయం నుంచి రాజీవ్ గాంధీ ఆడిటోరియం, తిలక్ గార్డెన్ వరకు పాఠశాలల విద్యార్థులతో, వయో వృద్ధులతో అవగాహన ర్యాలీని సునీతాకుంచాల జిల్లా జడ్జ్, చైర్మన్ డిఎల్ఎస్ఏ జెండా ఊపి ప్రారంభించారు. తదుపరి న్యూ అంబేద్కర్ భవన్ నందు జిల్లా స్థాయి ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. రాంపూర్ గ్రామం నందు ప్రభుత్వం తరపు నూతనంగా వృద్ధాశ్రమంను నిర్మించినట్టు, అతి త్వరలోనే నిరాశ్రయులైన వృద్ధులకు వసతి కల్పించబడుతుందని జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ బి.ఆంజనేయులు తెలిపారు. కార్యక్రమంలో పలు సేవలు అందించిన వయోవృద్ధులకు అధ్యక్షులకు, రైతులకు, సైనికులకు ముఖ్య అతిథులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నగర మేయర్ దండు నీతూ కిరణ్, సుదాం లక్ష్మి మహిళా కమిషన్ మెంబర్, జిల్లా సంక్షేమ అధికారి ఎస్.కే.రసూల్ బీ, సీనియర్ సిటిజన్ కమిటీ సభ్యులు, అసోసియేషన్ ఫోరమ్స్ క్లబ్స్ సొసైటీల ప్రతినిధులు బి. ఆంజనేయులు, టి.రాం మోహన్, యం. రాజేశ్వర్, దారం గంగాధర్, టి.అశోక్, నారాయణరెడ్డి, సాయిలు, వయో వృద్ధులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



కంఠేశ్వర్ : వృద్ధులను సన్మానించిన అధికారులు



కంఠేశ్వర్ :ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా జడ్జి సునీల కుంచాల

బాల్కొండ :

జిల్లా కేంద్రంలో ప్రపంచ వయోవృద్ధుల దినోత్సవ వేడుకల్లో మండల పరిధిలోని కిసాన్ నగర్ గ్రామానికి చెందిన సీనియర్ సిటిజన్ ఫోరం సుమారు 30 మంది సభ్యులు అధ్యక్షులు ఏ మనోహర్ ఆధ్వర్యంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా ఏ.మనోహర్ మాట్లాడుతూ.. కిసాన్ నగర్ సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో జరుగుతున్న వివిధ కార్యక్రమాలను వివరించారు. అనంతరం ఈ వేడుకల్లో ఫోరం సభ్యులను ఘనంగా సన్మానించారు.

ధాన్యాన్ని ప్రయివేటు వ్యక్తులకు అమ్మొద్దు

- రాష్ట్ర మార్క్‌ఫైడ్ చైర్మన్ మార గంగారెడ్డి

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

రైతులు తొందరపడి ధాన్యాన్ని ప్రైవేట్ వ్యక్తులకు అమ్ముకోవద్దని రాష్ట్ర మార్క్ ఫైడ్ చైర్మన్ మారగంగారెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ నందు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో సోయబీన్ కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర మార్క్ ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోయాబీన్ పంటలు పూర్తిగా కొనుగోలు చేస్తామన్నారు. ధాన్యాన్ని పూర్తిగా ఆరబెట్టి 12 శాతం తేమ వచ్చేటట్లు చూడాలన్నారు. నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధర పొందాలని తెలిపారు. జిల్లాలో బాల్కొండ, బోధన ప్రాంతాలలో ఎక్కువగా సాగు చేశారు. మొక్కజొన్న పంట కూడా మార్కెట్లో మద్దతు ధర ఉందని, వ్యాపారుల ఆ ధరను తగ్గిస్తే మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు కూడా ప్రారంభిస్తామని అన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ రమేష్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గడ్డం నర్సారెడ్డి, సొసైటీ వైస్ చైర్మన్ శ్రీధర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆత్మారం, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, సొసైటీ డైరెక్టర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, పాల్గొన్నారు.



సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మారగంగారెడ్డి

జీపీ సెక్రటరీని కలిసిన బీఆర్ఎస్ నాయకులు



నవతెలంగాణ-ముప్కాల్

ముప్కాల్ గ్రామపంచా యతీ కార్యదర్శిగా మల్లేష్ యాదవ్ ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సందర్భంలో మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సామ వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. పంచాయతీ సెక్రటరీగా తన విధులను కర్తవ్యంతో నిర్వర్తిస్తూ మంచి ప్రజాపాలన గ్రామానికి అందించాలని అన్నారు. పంచాయతీ సెక్రటరీని కలిసిన వారిలో మాజీ ఉప సర్పంచ్ కట్ట మహేష్, సంజీవ్, రఫీ, పంచాయతీ కారోబార్ తాహిర్, తదితరులు ఉన్నారు.

ఆర్‌యూబి వంతెనకు స్థల పరిశీలన

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఘన్‌పూర్ గ్రామాల మధ్య గల రైల్వేగేటు వద్ద ఆర్ యూబీ (రైల్వే అండర్ బ్రిడ్జి వంతెన) వంతెన నిర్మాణం కోసం స్థలాన్ని రైల్వే, ఆర్ అండ్ బీ, రెవిన్యూ, పోలీస్ శాఖధికారులు మంగళవారం పరిశీలించారు. రానున్న రోజుల్లో రైళ్ల రాకపోకల సంఖ్య పెరిగేఅఆవకాశం ఉండటం, వాహనదారుల ఇబ్బందులను తొలగించడానికిగాను ఇక్కడ ఆర్ యూబీ వంతెన నిర్మాణం అత్యవసరం కావడంతో నిర్మాణం చేయనున్నారు. ఆర్‌యూబీ వంతెన కోసం గతేడాది నడిపల్లి పంచాయతీ పాలక వర్గం సైతం ఏకగ్రీవంగా తీర్మానంచేసి ఉన్నతాధికారులకు ప్రజా ప్రతినిధులకు అందజేశారు. కాగా ఇక్కడ అధికారులు పరిశీలనకు రావడంతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యాజమానులు ఆందోళన చెందుతున్నారు. వారి వెంట ట్రాఫిక్ ఎసిపి నారాయణ, ఎస్‌హెచ్ఓ మహమ్మద్ షరీఫ్, మండల రెవెన్యూ అధికారి సంతోష్, రైల్వే అధికారులు, తదితరులు ఉన్నారు.

సభాస్థలి పరిశీలన

నవతెలంగాణ-కంఠేశ్వర్

రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులుగా నియమింపబడిన తర్వాత మొదటిసారి నిజామాబాద్ జిల్లాకు మహేష్ కుమార్‌గౌడ్ ఈనెల 4 రానుండడంతో పాత కలెక్టర్ గ్రౌండ్‌లో బహిరంగ సభను నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు మానాల మోహన్ రెడ్డి, ఎసిపి రాజ వెంకట్‌రెడ్డి కలిసి సభాస్థలిని మంగళవారం పరిశీలించారు. వీరితో పాటు జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు దయాకర్ గౌడ్, జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు వేణురాజ్ పరిశీలించారు.

రూ.72,500లకు ఇసుక వేలం

- చేజిక్కించుకున్న చిన్నోళ్ల వినోద్ కుమార్
- తహసీల్దార్ మాలతి

నవతెలంగాణ-ధర్పల్లి

అంత అనుకున్నట్లే జరిగిందని, అధికారులు పట్టుకున్న ఇసుక డంపు వేలం ద్వారా చివరకు ఎవరి ఇసుక వారివద్దకు వెళ్ళిందని దుబ్బాక గ్రామస్తులు అంటున్నారు. అక్రమంగా డంప్ చేసిన ఇసుకను అధికారులు పట్టుకొని సీజ్ చేసి మంగళవారం వేలం వేశారు. నవతెలంగాణ ముందురోజు ప్రచురించిన కథనం ప్రకారమే జరిగిందని ఆ గ్రామస్తులు చర్చించుకుంటున్నారు.

మండలంలోని దుబ్బాక గ్రామంలో అక్రమంగా నిల్వ చేసి ఉంచిన ఇసుక డంపును తహసీల్దార్ మాలతీ పోలీసుల సహకారంతో సీజ్ చేసి వేలం వేశారు. సదరు వ్యక్తి గ్రామంలోని కొందరిని మంచిగా చేసుకొని ఎవ్వరు ఈవేలంలో పాల్గొనకుండా జాగ్రత్తలు వహించాడని, ఇందుకు ఓమాజీ సర్పంచ్ సహకరించినట్లు తెలిసింది. గ్రామం నుండి ఎవర్యూ పాల్గొనకుంటే తప్పుడు సమాచారం వెళ్లినట్లు అవుతుందని గ్రహించి ముగ్గురు నలుగురిని వెంటవేసుకొని కార్యాలయానికి వచ్చారు. వేలంలో పాల్గొనేవారు 10 వేల డిపాజిట్ పెట్టాలని తహసీల్దార్ చెప్పడంతో గ్రామంనుండి కేవలం ముగ్గురు మాత్రమే పాల్గొన్నారు. మండల కేంద్రానికి చెందిన మరో ఇద్దరు వ్యక్తులు వేలంలో పాల్గొనగా అక్కడ ఇసుక చూడకుండా ఎలా వేలం వేస్తారని, మొత్తం దొడ్డు ఇసుక ఉంది లాభం లేదు..పైగా అక్కడినుడి మీరు తెస్తే లేబర్ చార్జీలు, వాహన చార్జీలు పడవు.. నష్టం వస్తుందని బుకాయించారు. కేవలం 72,500 లకే అదేగ్రామానికి చెందిన చిన్నోళ్ల వినోద్ కుమార్ దక్కించుకున్నట్లు బయట ప్రచారం జరుగుతుంది. అధికారులు పట్టుకున్న ఇసుక డంపులనుండి అధికారుల కళ్ళు గప్పి సోమవారం రాత్రి అదేగ్రామానికి చెందిన సదరు వ్యక్తి సుమారు 20 ట్రిప్పులు అమ్ముకొని సొమ్ము చేసుకున్నట్లు గ్రామంలో చర్చ జరుగుతుంది. అదే సొమ్ముతో వారే వేలంలో పాల్గొని వారి ఇసుక డంపును చేజిక్కించుకున్నారని అందరి నోట అదే మాట వినిపిస్తోంది. అధికారులు విచారణ చేసి వేలం వేస్తే బాగుండేదని ఆగ్రామస్థులు అనుకుంటున్నారు. పక్కా ప్లాన్‌తో అధికారులను సైతం బోల్తాకొట్టించాడని ఊరంతా కోడై కూస్తోంది. ఏదేమైనప్పటికీ వేలంలో వచ్చిన రూపాయలను కలెక్టర్ పేరున డిడి అందించాలని అధికారులు ఆదేశించారు. ఇసుక డంపును రెడురోజుల్లో ఖాళీ చెయ్యాలని, ఇతర చోట్ల డంపులు వేసిన ,మండలం దాటి ఇతర చోటికి పంపిన మళ్లి దొరికితే జరిమానా తప్పదని హెచ్చరించారు. వేలంలో అర్‌ఐలు రాజేశ్వర్, రవి పాల్గొననగా శేఖర్ గౌడ్, వినోద్ కుమార్,కావేటి నవీన్,ఆవుసుల రాము, తదితరులు వేలంపాటపాడారు.



వేలంలో పాల్గొన్న అధికారులు, పాటదారులు

టీయూలో సమస్యలు పరిష్కరించాలి

- రిజిస్ట్రార్‌కు వినతి

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎన్ఎస్‌యుఐ యూనివర్సిటీ అధ్యక్షుడు బానోత్ సాగర్ నాయక్ తెలిపారు. మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన యూనివర్శిటీ హాస్టల్ గదుల్లో ఫ్యాన్‌లు, కిటికీలకు మెష్‌లతో పాటు హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించాలని పేర్కొన్నారు. రాత్రిపూట వీధి దీపాలు వెలగడం లేదని, దీంతో విద్యార్థులు రాత్రి వేళల్లో లైబ్రరీకి వెళ్ళాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. తాగునీరు సైతం ఫిల్టర్ కావడం లేదని, సంబంధిత సిబ్బందితో నీటి పరీక్షలు సైతం చేయించాలని కోరారు. సమస్యల పరిష్కారానికి రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించారని బానోత్ సాగర్ నాయక్ తెలిపారు. రిజిస్ట్రార్‌ను కలిసిన వారిలో ఎన్ఎస్‌యుఐ వర్సిటీ ఉపాధ్యక్షుడు హరీష్, సందీప్, రాజేంద్ర ప్రసాద్, దేవేందర్, చందర్ రాథోడ్, తదితరులున్నారు.

హైడ్రా విషయంలో హైకోర్టుకు హ్యాట్సాఫ్

- మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

హైడ్రా విషయంలో పేదల పక్షాన నిలిచిన హైకోర్టుకు మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి మంగళవారం హాట్సాఫ్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో కాంగ్రెస్ అంటే ఇందిరా గాంధీ గరీబ్ హటావో అనే నినాదం ఉండేది కానీ ప్రస్తుతం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో గరీబ్‌కో బగావో అన్నట్లుగా ఉందని అన్నారు. హైడ్రా పేరుతో హైడ్రా డ్రివేషన్ చేస్తున్న ముఖ్యమంత్రి పంచభూతాలను దోచుకుంటున్న ఏకైక వ్యక్తి రేవంత్‌రెడ్డి అని, ఎక్కడ చూసినా కుంభకోణాలే కనిపిస్తున్నాయని విమర్శించారు. రేవంత్‌రెడ్డి, రాహుల్ గాంధీ, రాబర్ట్ వాద్రా, రంగనాథులు కలిసి హైదరాబాద్‌లోని పేద ప్రజల ఉసురు పోసుకుంటున్నారనీ, వెంటనే హైడ్రాను రద్దు చేయాలని తెలిపారు. హైడ్రాను రద్దు చేయకపోతే, రైతులకు రుణమాఫీ చేయకపోతే ఆర్మూర్ రైతులు మిమ్మల్ని తరిమి తరిమి కొడతారు. గతంలో రైతులు తరిమికొట్టిన రోజులను చూసే ఉంటారని అన్నారు. భారతదేశంలో అతిపెద్ద కుంభకోణం ఏదైనా ఉంది అంటే మూసీ నది రివర్ ఫండ్ లక్ష యాభై వేల కోట్ల రూపాయలు అని, నవామి గంగ ప్రాజెక్టు నలభై వేల కోట్లకు చేస్తుంటే కేవలం 53 కిలోమీటర్ల ఉన్న మూసీ నదికి లక్ష 50 వేల కోట్ల రూపాయలు పెడదామనడం విడ్డూరం అన్నారు. 420 పథకాలను తీసుకువచ్చి ప్రజలకు ఏమి చేయకుండానే ప్రజలపై హైడ్రా పేరుతో ఎన్నో మోసాలు చేస్తున్నారని అన్నారు హైడ్రాను రద్దుచేసి రైతులందరికీ రుణమాఫీ ఇవ్వడంతోపాటు రైతుబంధు కళ్యాణ్ లక్ష్మి తులం బంగారం వెంటనే అందించాలని తెలిపారు. లేకుంటే కాంగ్రెస్ పార్టీకి ఓట్లేసిన ప్రజలు పాతాళంలోకి తొక్కేస్తారని హెచ్చరించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
బుధవారం అక్టోబర్ 02, 2024 www.navatelangana.com

గాంధీజి ఆశయాల సాధనే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం

- కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి



నవతెలంగాణ-కామారెడ్డి

గాంధీజీ ఆశయాల సాధన కోసం బిజెపి ముందుకు వెళుతుందని కేంద్ర వినియోగదారులు వ్యవహారాలు ఆహార ప్రజా పంపిణీ మంత్రి ప్రహ్లాద జోషి అన్నారు. కామారెడ్డి కొత్త బస్ స్టాండు ఆవరణలో స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛ భారత్ ఉద్దేశం నాయకులు రోడ్లు ఊడ్చడం మాత్రమే కాదు ప్రజలకు అవగాహన కల్పించడం అని, ప్రజలు కూడా ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయకుండా ప్రభుత్వ అధికారులు ఏర్పాటు చేసిన చెత్త బట్టల్లో చెత్త వేస్తే ఎవరికి ఇబ్బంది కలగదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు అరుణతార, కామారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి, మాజీ ఎంపీ బీబీ పాటిల్, కామారెడ్డి మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మోటురి శ్రీకాంత్, బిజెపి కౌన్సిలర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఎడపల్లి : ఏఆర్‌పి క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబురాలు



నిజామాబాద్ సిటీ: హోవర్డ్ హై స్కూల్లో బతుకమ్మతో ఉపాధ్యాయిలు



భీంగల్‌లోని లిటిల్ ఫ్లవర్ హైస్కూల్‌లో

బంగారు బతుకమ్మ ఉయ్యాలో..

- పాఠశాలలల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు

నవతెలంగాణ-విలేకరులు

జిల్లాలోని పలు ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఉపాధ్యాయునులు, విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను తయారుచేశారు. పాఠశాలల ఆవరణలో పాటలు పాడుతూ బతుకమ్మ ఆడారు. అనంతరం స్థానిక చెరువుల్లో నిమజ్జనం చేశారు.

జక్రాన్‌పల్లి : మండల కేంద్రంలోని తేజస్ విద్యానికేతన్ లో విద్యార్థులతో బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల యజమాన్యం తెలంగాణలోని బతుకమ్మ సంబరాల గురించి వరించారు.

ఎడపల్లి : మండలంలోని ఏఆర్‌పి క్యాంప్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బతుకమ్మ సంబరాలను ప్రధానోపాధ్యాయులు పి. రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు రంగురంగుల పువ్వులతో బతుకమ్మలను అలంకరించారు. అనంతరం పాఠశాల ఆవరణంలో బాలికల తో పాటు మహిళా ఉపాధ్యాయులు బతుకమ్మ పాటలు పాడు తూ ఆడారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో బంగారు బతుక మ్మ ఉయ్యాలో అంటూ పాటలు పాడుతూ చప్పట్లతో బతుక మ్మల చుట్టూ తిరిగారు. అనంతరం గ్రామ సమీపానగల నిజాంసాగర్ కాలువలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

బోధన్ : సాలూర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ఎంఈఓ రాజి మంజూష ఉపాధ్యాయునులు, విద్యార్థులతో కలిసి ఆడిపాడారు. బతుకమ్మ పాటలకు లయబద్ధంగా నృత్యాలు చేశారు.

పోతంగల్ : మండలంలోని పాఠశాలలలో బతుకమ్మ సంబరాలు విద్యార్థులు, ఉపాధ్యాయులు కలసి, తెలంగాణ సాంస్కృతి ఉట్టిపడేలా జరుపుకున్నారు. ఉపాధ్యాయులు నాగనాథ్ మాట్లాడుతూ బతుకమ్మ పండుగ విశిష్టతను తెలియజేశారు.

నిజామాబాద్ : నిజామాబాద్ జిల్లా కేంద్రంలో గల బ్రిలియంట్ హై స్కూల్ లో తీరొక్క పూలతో బతుకమ్మలను తయారుచేశారు. పూలతో బతుకమ్మ తయారుచేసిన ఆడడం ఆనవాయితీగా వస్తుందని పాఠశాల ప్రిన్సిపాల్ కేసరి రాజేంద్రప్రసాద్ తెలిపారు. బతుకమ్మ పండగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, విద్యార్థులు, పాల్గొన్నారు.

కమ్మర్‌పల్లి : మండలంలోని ఉప్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాల్లో ప్రధానోపాధ్యాయులు గిరిధర్ మాట్లాడుతూ తెలంగాణలో ఆడపడుచులు అద్భుతంగా జరుపుకునే ఉత్సవం ఈ బతుకమ్మ పండుగ అన్నారు. ప్రకృతిలో లభించే పూలను సైతం పూజించే సాంప్రదాయం బతుకమ్మ అని అన్నారు. బతుకమ్మతో పసుపుతో చేసిన గౌరమ్మను నీటిలో వదలడం వల్ల వర్షాల వల్ల కొత్తగా వచ్చి చేరిన నీటిలో ఉండే క్రిములు నశించి నీరు శుద్ధి అవుతుందన్నారు. పండుగల్లో ఇటు సైన్సును, అటు భక్తిని చూపడం అనేది చాలా గొప్ప విషయం అన్నారు.



పోతంగల్‌లో..

రెంజల్ : మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థినిలతో బతుకమ్మ సంబరాలను నిర్వహించినట్లు ప్రిన్సిపల్ ఫిరోజ్ తెలిపారు. ప్రతి సంవత్సరం బతుకమ్మలను తయారు చేసి సంబరాలు జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని ఆయన చెప్పారు.



నిజామాబాద్ సిటీ: శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో...



డిచ్‌పల్లి: ప్రభుత్వ ప్రాథమిక పాఠశలలో...



నందిపేట్‌లో...

బాల్కొండ : మండల కేంద్రంలోని శ్రీ వెంకటేశ్వర, మదర్ తెరిసా హై స్కూల్ ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు.కరస్పాండెంట్ రామలక్ష్మి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు విద్యార్థులు భారీ బతుకమ్మను తయారు చేశారు. విద్యార్థులకు బతుకమ్మ పండుగ యొక్క విశిష్టతను తెలియజేశారు. అనంతరం బతుకమ్మ ను మండల కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా తీసుకెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో శ్రీ వెంకటేశ్వర హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, మదర్ తెరిసా హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిజామాబాద్ సిటీ : శ్రీ చైతన్య టెక్నో స్కూల్ గూపన్‌పల్లి బ్రాంచ్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతిక సాంప్రదాయాలు పెంపొందించే విధంగా విద్యార్థులతో బతుకమ్మ పండుగ నిర్వహించినట్టు శ్రీ చైతన్య ఏజీఎం సతీష్ రెడ్డి, ప్రిన్సిపాల్ హుస్సేన్, అకడమిక్ కోఆర్డినేటర్ నరేందర్ తెలిపారు. కార్యక్రమంలో పూర్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజామాబాద్ నగరంలోని శ్రీ చైతన్య టెక్నో స్కూల్ వినాయక నగర్ ప్రాంతంలో గల పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణ పాల్గొన్నారు

ఆర్మూర్ : మున్సిపాలిటీలోని మామిడిపల్లి నలంద హై స్కూల్, విజయ్ హై స్కూల్, పెర్కిట్ కాంతి హై స్కూల్ , గాంధీనగర్ శివారులోగల ఆక్స్‌ఫర్డ్ పాఠశాలలో బతుకమ్మను ఘనంగా నిర్వహించారు. నలంద పాఠశాలలో ఎఫ్ఎ టులో మొదటి మూడు ర్యాంక్స్ సాధించిన వారికి సన్మాన కార్యక్రమం, తరువాత బతుకమ్మ పండుగను నిర్వహించారు. పాఠశాల యాజమాన్యం ప్రసాద్ బతుకమ్మ ప్రాముఖ్యతను తెలియజేసారు. తరగతికి కొక్క బతుకమ్మ చొప్పున సుమారుగా 25 బతుకమ్మలు గునుగు, తంగేడు, చామంతి, బంతి గులాబీ పూల తో అలంకరించి బతుకమ్మ పాటలు దాండియా ఆటలతో పాఠశాలలో పండుగ వాతావరణం నెలకొంది. బతుకమ్మ నిమజ్జనంలో విద్యార్థులు వారి తల్లిదండ్రులు ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

స్మైల్స్ ద స్కూల్‌లో..

స్మైల్స్ ద స్కూల్‌లో బతుకమ్మ సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. చిన్నారులు ట్రెడిషనల్ డ్రెస్సెస్‌తో వచ్చి బతుకమ్మ సాంగ్స్ మీద డాన్స్ చేసి ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ షబానా గోహర్, డైరెక్టర్ రఫీ గౌహర్, ఉపాధ్యాయులు సింధూర, సవిత, శ్రావణి, రోజా, సరిత, సింధుజ, ప్రసన్న, స్వప్న పాల్గొన్నారు.

డిచ్‌పల్లి : ఇందల్‌వాయి మండల కేంద్రంలోని తిర్మన్‌పల్లి గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా బతుకమ్మ వేడుకలు నిర్వహించారు.

భీంగల్ రూరల్ : మండల కేంద్రంలోగల లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో కరస్పాండెంట్ డాక్టర్ షఫీ, మేనేజింగ్ డైరెక్టర్ సనా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు మిన్నంటేలా ఘనంగా జరుపుకున్నారు. తొమ్మిది రోజులు జరుపుకొనే ఈ పండుగను మొదటి రోజు విద్యార్థినులు తీరొక్క పువ్వులతో అందంగా పేర్చి రంగు రంగుల బతుకమ్మలను తయారు చేసి కోలాటలు ఆడుతూ చిందులు వేస్తూ స్థానిక బస్టాండ్ వరకు ఊరేగింపుగా వెళ్లి చెరువులో నిమజ్జనం చేశారు. విద్యార్థులు తయారు చేసిన పదిహేను అడుగుల బొడ్డెమ్మ చూపరులను ఆకట్టుకొంది. కార్యక్రమం లో ప్రిన్సిపాల్ రాధాకృష్ణన్ నాయర్, ప్రైమరీ ఇంచార్జి బీను, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రకాష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జక్రాన్‌పల్లి : మండలంలోని తొర్లికొండ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం గుణుకపువ్వుతో చేసిన బతుకమ్మ పండుగ సంబురాన్ని నింపింది. కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయలక్ష్మి, లలిత, హరికృష్ణ, విద్యార్థినిలు పాల్గొన్నారు.



నిజామాబాద్: బ్రిలియంట్ స్కూల్‌లో...



కమ్మర్‌పల్లి: ఉప్లూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో...



బాల్కొండలో...



అర్మూర్‌లో...

బీఆర్ఎస్ ధర్నా.. హాస్యాస్పదం

- కాంగ్రెస్ నాయకుల విమర్శ



మాట్లాడుతున్న పలువురు

నవతెలంగాణ గాంధారి

మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు ధర్నా నిర్వహించడం హాస్యస్పదంగా ఉందని కాంగ్రెస్ నాయకులు విమర్శించారు. మండల కేంద్రంలో మంగళశారం విలేకరుల సమావేశం లో కాంగ్రెస్ నాయకులు మమ్మాయి సంజీవ్ యాదవ్, తూర్పు రాజులు, కామెల్లి బాలరాజ్ మాట్లాడారు. రైతులకు బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు 10 సంవత్సరాలు పరిపాలనలో ఏం చేశారని ప్రశ్నించారు. బిజెపి అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడ రుణమాఫీ చేయలేదని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట మీద రుణమాఫీ చేసిందని తెలిపారు. ఎమ్మెల్యేను గాని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కానీ అకారణంగా విమర్శిస్తే బీఆర్ఎస్ నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ పరమేష్, సొసైటీ ఛైర్మన్ సాయికుమార్, గాంధారి తాజా మాజీ సర్పంచ్ మమ్మాయి సంజీవ్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు తూర్పు రాజు, కామెడీ బాలరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోహన్ నాయక్, ఏం సి డైరెక్టర్ ఆకుల లక్ష్మణ్ ,సొసైటీ డైరెక్టర్ గాండ్ల లక్ష్మణ్, సీనియర్ నాయకులు లైన్ రమేష్, సంఘని బాబా, బొమ్మని బాలయ్య, బిస గణేష్ ,సాకలి కృష్ణ ,సాకలి సంజీవ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

తనిఖీల పేరుతో వేధింపులు

- మండల వ్యవసాయాధికారిపై సీడ్స్,ఫెస్టిసైడ్స్ డీలర్ల ఆరోపణ
- జిల్లా వ్యవసాయాధికారిపై ఎంఏవో ఫిర్యాదు నేపథ్యంలో గళం విప్పిన వైనం

నవతెలంగాణ-రెంజల్

రెంజల్ మండల వ్యవసాయ అధికారి తనిఖీల పేరుతో వేధింపులకు పాల్పడుతున్నట్టు మండలంలోని 14 మంది సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్‌లు ఆరోపించారు. మంగళవారమిక్కడ విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. దుకాణాల తనిఖీల పేరుతో తమను అనేక ఇబ్బందులకు గురి చేసేవాడని, అందిన కాడికి తీసుకుంటూనే, వ్యవస్థలో తప్పు చేసిన వారై ఉండవచ్చా అంటూ తమపై ఆరోపణలు చేసేవాడని వారు ఆరోపించారు.

డీలర్లను బెదిరిస్తూ వారి వద్ద వసూలు చేసిన లావాదేవీలకు సంబంధించిన రికార్డులన్నీ తమ వద్ద ఉన్నాయని తెలిపారు. డీలర్లు దుకాణాలను మూసివేసి ఇంటికి వెళ్ళిన తర్వాత అర్ధరాత్రి ఫోన్ చేసి తమను వేధించే వారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆధారాలతో సహా జిల్లా వ్యవసాయ అధకారికి, బోధన్ ఎమ్మెల్యే పి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఆయనపై మండలంలో సమగ్ర విచారణ జరిపించి డిప్యూటేషన్ బాధ్యతల నుంచి తప్పించి తమకు శాశ్వత మండల వ్యవసాయ అధికారిని నియమించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రెంజల్ మండలం పెస్టిసైడ్స్ దుకాణాల యూనియన్ అధ్యక్షులు కార్తీక్, ఉపాధ్యక్షులు సతీష్, ప్రధాన కార్యదర్శి మీర్జా అమీర్ బేగ్, కోశాధికారి శివకుమార్, డీలర్ల సంగం గౌరవ సభ్యులు రమేష్, మోహన్ రెడ్డి, నాగరాజు, ఇఫ్తాకర్, ఇమ్రాన్, ఆకుల గంగాధర్ (బుజ్జి) తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పలువురు

ముదురుతున్న సర్వే వివాదం..

సర్వే వివాదం చినికి చినికి గాలివానలా మారుతోంది. ఏఈవోలు సర్వే చేపట్టకపోవడంతో రెంజల్ ఎంఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి నోటీసులు ఇవ్వడంతో వివాదం చెలరేగింది. దీంతో ఏఈవోలు తమ యూనియన్ ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లిన విషయం విధితమే. అయితే తనను కించపరిచేలా సోషల్‌మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై పరువునష్టం కింద లక్ష్మీకాంత్‌రెడ్డి కేసు పెట్టిన విషయం విధితమే. దీంతో పాటు జిల్లా వ్యవసాయాధికారిపై సైతం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో మండల సీడ్స్ అండ్ ఫెస్టిసైడ్స్ డీలర్‌లు ప్రెస్‌మీట్ పెట్టి ఆరోపణలు చేయడం గమనార్హం.

ఎంఏవో డిప్యూటేషన్ రద్దు..

అనేక వివాదాల మధ్య ఎంఈవో లక్ష్మీకాంత్‌రెడ్డి డిప్యూటేషన్ రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. మనుపటి బోధన్ మార్కెట్ కమిటీ బాధ్యతలు అప్పగించారు. కాగా ఆయన స్థానంలో ఎడపల్లి ఎంఏవో సిద్ధరామేశ్వర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు.

వాన వెంట వరద

- గాంధారిలో నడవాలంటే నరకయాతనే

నవతెలంగాణ-గాంధారి



గాంధారి మండల కేంద్రంలోని ప్రధాన రోడ్డు నుండి నెహ్రూ చౌక్ నుండి గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు వర్షాలు కురిస్తే వరదలా రావడంతో గ్రామంలోకి వెళ్లే ప్రధాన రోడ్డు మొత్తం నీట మునిగిపోతుంది. మోకా లు లోతు నీరు నిలిచి ఉండటంతో గ్రామంలోకి వెళ్లాలంటే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారు. ప్రజలు పడుతున్న అవస్థలను ఇటు నాయకులు కానీ అటు అధికారులు కానీ పట్టించుకున్న పాపాన పోవడం లేదు.ప్రభుత్వాలు మారుతున్నా పాలకులు మారుతున్నా రోడ్డు పరిస్థితి మారడం లేదని గాంధారి గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతిసారి ఎన్నికల అప్పుడు హామీలు ఇవ్వడం ఎన్నికలు అయిపోగానే మర్చిపోవడం పరిపాటిగా మారిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గతంలో ఒక నాయకుడు సిసి రోడ్డు వేశాడు కానీ అది నాలుగు నెలలకే మొత్తం కంకర తేలిపోయింది. గ్రామ ప్రజలు ఎంపీకి ఎమ్మెల్యేకు సంబంధించిన అధికారులకు పలుమార్లు వినతి పత్రాలు సమర్పించినా ఏ ఒక్కరూ పట్టించుకున్న పాపాన పోవడం లేదు. దీంతో ప్రజలు గ్రామంలోకి వెళ్లే ప్రధాన రహదారి ఇలా ఉండడంతో వేరే గ్రామాల వారు గ్రామానికి వచ్చినప్పుడు గాంధారి పేరు గొప్ప కానీ రోడ్డు లేవా అని హేళన చేస్తున్నారు. వర్షం పడిందంటే చాలు ఆ రోడ్లో ప్రయాణం నరకంగా ఉందని ఇప్పటికైనా అధికారులు ప్రజాప్రతినిధులు పట్టించుకోని తక్షణమే రోడ్డు వేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు. లేకపోతే వచ్చే స్థానిక సంస్థ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామని ప్రజలు హెచ్చరిస్తున్నారు.